
Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 20.05.2016, శుక్రవారం సంపుటి : 35 సంచిక : 51 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com



> బాబుకు లభించని హామీ

> హోదా ఇక ఎండమావే!

# కరుణించని కేంద్రం

**అడగనిదే అమ్మయినా పెట్టదంటారు. అయితే ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబు అడుక్కుంటున్నా కేంద్ర ప్రభుత్వం పెట్టడంలేదు. అసలు ఆయన మాటనే పట్టించుకోవడం లేదు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా అంశాన్ని చంద్రబాబు ఎంత సాధారణంగా తీసుకుంటున్నాడో, కేంద్ర ప్రభుత్వం అంతకంటే సాధారణంగా తీసుకుంటోంది.**

సిద్ధడు అద్దంకి పోనూ పోయాడూ, రానూ వచ్చాడు... అన్నట్లుగా వుంది ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ పర్యటన. ప్రత్యేకహోదాతో పాటు రాష్ట్రానికి రావాల్సిన నిధులు, విభజన హామీల గురించి ప్రధానితో చర్చించడానికై చంద్రబాబు ఢిల్లీ వెళ్లాడు. ప్రధానితో సమావేశమయ్యాడు. ఒక వినతిపత్రం కూడా సమర్పించాడు. ప్రధాని నరేంద్ర మోడీ కూడా ఈయన ఇచ్చిన అర్జీని తీసుకుని చదివి చూస్తానని చెప్పి పంపించారు. ప్రత్యేకహోదా, లోటుబడ్జెట్, విభజన హామీలపై ప్రధాని నుండి ఎలాంటి స్పష్టమైన హామీ లేదు. నాయకులు సాధారణ ప్రజల నుండి అర్జీలను తీసుకుని ఎలా పక్కన పడేస్తుంటారో... చంద్రబాబు ఇచ్చిన అర్జీని కూడా ప్రధాని అలాగే పక్కనపెట్టాడు. కేవలం చంద్రబాబు బాకా ఊదే పచ్చ మీడియా మాత్రం చంద్రబాబు ఢిల్లీలో కేంద్రాన్ని కడిగేసాడని, సీరియస్‌గా మాట్లాడాడని ఊదరగొట్టింది.

ఇంతకుముందులాగా ఢిల్లీలో చంద్రబాబు చక్రం తిప్పే పరిస్థితి లేదు. ఎన్డీఏ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్నప్పటికి బీజేపీని గద్దించే స్థితిలో తెలుగుదేశం లేదు. చంద్రబాబు గట్టిగా మాట్లాడితే వాళ్ళే బయటకు పొమ్మనేటట్లున్నారు. ఇప్పుడున్న పొజిషన్‌లో చంద్రబాబు కూడా వారితో కయ్యం పెట్టుకోలేదు.

ముఖ్యంగా రాష్ట్రంలో చంద్రబాబు పరిపాలనా విధానాలపై ప్రధాని మోడీ సీరియస్‌గా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రధాని దేశంలో సబ్సిడీల తగ్గింపుకు, దుబారా అదుపుకు ప్రాధాన్యతినిస్తున్నారు. అన్ని రంగాల్లోనూ ఆర్థిక పరిపుష్టికి కృషి చేస్తున్నారు. ఉట్టికెక్కలేనమ్మ స్వర్గానికి నిచ్చెన వేసిందనట్లుగా వున్న చంద్రబాబు పరిపాలనా పోకడలు (మిగతా 11వ పేజీలో)

• ఓటరు నేర్పు...

# విభిన్న తీర్పు

- తమిళనాట 'జయం'
- బెంగాల్‌లో దీదీ దిగ్విజయం
- ఈశాన్యంలో ఎగిరిన కాషాయం
- కేరళలో ఎర్ర మెరుపులు
- పుదుచ్చేరిలో కాంగ్రెస్

దేశానికే మినీ ఎన్నికల సంగ్రామంగా చెప్పుకోదగ్గ ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు ఈ నెల 19వ తేదీన వెలువడ్డాయి. మూడు దక్షణాది రాష్ట్రాలు, ఒక మధ్యభారత రాష్ట్రం, ఒక ఈశాన్య రాష్ట్రంలో ఎన్నికలు జరుగగా ఓటర్ల తీర్పు ఎంతో విభిన్నంగా వుంది. ముఖ్యంగా ఆయా రాష్ట్రాల స్థానిక సమస్యలే ఈ తీర్పులపై ప్రధాన ప్రభావం చూపాయి.

## అమ్మకే తిరిగి పట్టం:

తమిళనాడు చరిత్రలో సరికొత్త రికార్డు నమోదైంది. ప్రతి ఐదేళ్లకు ప్రభుత్వాన్ని మార్చే తమిళ ఓటర్లు ఈసారి ఆ సాంప్రదాయానికి నీళ్లొదిలారు. 'అమ్మ'కు అమ్మ ఉచిత పథకాలకు ఆకర్షితులయ్యారు. ఆమె పరిపాలనను (మిగతా 11వ పేజీలో)

• రాజ్యసభలో వైకాపాకు...

# ఆ ఒక్కటన్నా దక్కేనా?

**రాజ్యసభ సభ్యుల ఎన్నిక ప్రక్రియకు ఎన్నికల సంఘం పచ్చజెండా ఊపింది. ఈమేరకు ఆంధ్రప్రదేశ్ నుండి నలుగురు సభ్యులు రాజ్యసభకు ఎన్నిక కానున్నారు. ప్రస్తుతమున్న శాసనసభ్యుల బలాబలాలు చూస్తే తెలుగుదేశంకు మూడు, వైకాపాకు ఒకటి రాజ్యసభ స్థానాలు దక్కనున్నాయి. అయితే రాష్ట్రంలో రేపేం జరుగుతుందో చెప్పలేని పరిస్థితి నెలకొంది.**

రాష్ట్రంలో తెలుగుదేశంపార్టీ చేపట్టిన ఆపరేషన్ ఆకర్ష్‌కు ఇంతవరకు 17మంది దాకా వైకాపా ఎమ్మెల్యేలు ఆకర్షితులయ్యారు. వైకాపాకు ఇంకా 50మంది సభ్యులున్నారు. రాజ్యసభకు గెలవాలంటే 36మంది ఎమ్మెల్యేలు చాలు. ఈ లెక్కన వైకాపాకు ఇంకా రాజ్యసభ అవకాశం ఉన్నట్లే! అయితే రాజ్యసభ ఎన్నికల లోపు మరో 15 మంది ఎమ్మెల్యేలను తెలుగుదేశంలోకి తీసుకొచ్చే ప్రయత్నాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ నెల 26లోగా మరో పదిమంది వైకాపా ఎమ్మెల్యేలు తెలుగుదేశం గూటికి చేరే అవకాశాలున్నాయని వినపడుతోంది. అదేరోజు వైకాపా అభ్యర్థిగా విజయసాయిరెడ్డి నామినేషన్ వేయనున్నారు. మరో పదిమంది వస్తే మిగతా ఎమ్మెల్యేలు కూడా టిడిపి వైపు క్యూ కడతారని టాక్! తమ ఎమ్మెల్యేలను కాపాడుకోవడానికి వైకాపా అధిష్టానం పాస్‌పోర్టు వున్న ఎమ్మెల్యేలందర్నీ విదేశాలకు పంపించి క్యాంపు నిర్వహించే అవకాశాలున్నట్లు కూడా విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈమేరకు తమ వారి అందరిదగ్గర పాస్‌పోర్టులు కూడా సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే, తెలుగుదేశం రాజ్యసభ అభ్యర్థులెవరన్నది ఇంతవరకు ప్రకటించ లేదు. వైకాపా రాజ్యసభ అభ్యర్థిగా మాత్రం వేణుంబాక విజయసాయిరెడ్డి ఖరారైనట్లే! వైకాపా నుండి ఎమ్మెల్యేలను కట్టడి చేసుకో గలిగితేనే ఆయనకు రాజ్యసభ యోగం వుంటుంది. లేకుంటే ఆశలు గల్లంతే!

# లాయర్‌కు నాటా ఆహ్వానం

3లో





కూలిన చెట్లను చూస్తున్న నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్

# బాధితులను ఆదుకోవాలి

ఈ నెల 18, 19తేదీలలో కురిసిన వర్షాలకు నెల్లూరు నగరంలోని 13, 15 డివిజన్‌లలో విద్యుత్ స్థంభాలు, తీగలు, చెట్లు, చిన్న చిన్న ఇళ్లు పడిపోవడంతో బుధవారం నెల్లూరు నగర శాసనసభ్యులు డా॥ పి.అనిల్‌కుమార్‌యాదవ్ ఈ ప్రాంతాల్లో పర్యటించి అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షం కారణంగా 13వ డివిజన్‌లో కొన్ని ప్రాంతాల్లో, 15 డివిజన్‌లో ఎక్కువగా సమస్యలు తలెత్తాయన్నారు. ఈ ప్రాంతాల్లో విద్యుత్ స్థంభాలు, తీగలు, పెద్దపెద్ద చెట్లు నేలకొరగడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. విద్యుత్ అధికారులు, కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది, స్థానిక కార్పొరేటర్లు చొరవ తీసుకొని చాలా వేగంగా పనులు చేపట్టి, చాలావరకు ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేసినందుకు వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఊటుకూరు మాధవయ్య, ఓబిలి రవిచంద్ర, నాయకులు లోకిరెడ్డి వెంకటేశ్వర్లురెడ్డి, కర్తం ప్రతాప్‌రెడ్డి, ఎస్‌కె సుభాన్, కార్పొరేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కన్యకా పరమేశ్వరిదేవికి ప్రత్యేక పూజలు

నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలో వెలసివున్న శ్రీ కన్యకా పరమేశ్వరి దేవికి ఈనెల 14న ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని ఉదయం అభిషేకాలు, నవావరణ పూజలు, ఖడ్గమాల, లలితా సహస్రనామ పూజలు నిర్వహించారు. సాయంత్రం పూలంగిసేవ, ఆలయ ప్రాకారోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు.






# మండే ఎండల్లో.. జోరున వాన

ఎండలు భగ్గుమనే మే నెలలో వానలు రావడం ఆశ్చర్యమే. బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడడంతో ఆ ప్రభావంతో గత రెండు మూడు రోజులుగా జిల్లావ్యాప్తంగా వానలు జోరుగా కురిశాయి. ఎండలు భగభగమంటున్న తరుణంలోనే, జనమంతా తీవ్ర ఉష్ణోగ్రతలకు అల్లాడిపోతున్న సమయంలోనే ఉన్నట్లుండి వానలు కురవడంతో ఆ సెగల నుంచి ప్రజలకు ఎంతో ఉపశమనం కలిగినట్లయింది. బుధ, గురువారం ఈ రెండు రోజులూ జిల్లా అంతటా తుఫాన్ వాతావరణం ముసురుకుంది. ఈదురుగాలులు, జోరువాన మధ్య జిల్లా తడిసిముద్దయింది. ఈ ఎండల్లో ఉన్నట్లుండి వానలు కురవడంతో భూమి చల్లబడింది. ఈ అకాల

సింహపురి సమాచారం

వర్షంతో జోరున వీచిన ఈదురుగాలులతో జిల్లాలో పలుచోట్ల పంటపొలాలు, పండ్ల తోటలు దెబ్బతినడంతో ఆయా ప్రాంతాల్లో రైతులు ఇబ్బందులకు గురయ్యారు. అనేకప్రాంతాల్లోని వాగులు వంకలు నిండిపోయి జలకళ రావడంతో, వచ్చే నెల నుంచి రెండో పంట వేసుకునేందుకు సమాయత్తమవుతున్న రైతులకు ఈ వానలు తమకెంతో మేలు చేస్తాయని సంతోషిస్తున్నారు. కాగా, జోరువాన ధాటికి నగరంలోని రోడ్లు జలమయమై జనజీవనం స్తంభించిపోయింది. పలుచోట్ల విద్యుత్ సరఫరాకు బాగా అంతరాయం కలిగింది. ఈదురుగాలుల వల్ల బుధవారం రాత్రి నగరంలోని బాలాజీనగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్‌స్తంభాలు నేలకూలాయి. ఈ సమాచారంతో వెంటనే జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ ఇంతియాజ్ బాలాజీనగర్‌లో



వర్షాలకు కూలిన వృక్షాలను పరిశీలిస్తున్న జేసీ ఇంతియాజ్ అహ్మద్

పర్యటించి అక్కడి పరిస్థితులను స్వయంగా తెలుసుకున్నారు. పలుచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోవడంతో వెంటనే ఆ చెట్లను తొలగించాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ తీగలను సరిచేసి విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, దెబ్బతిన్న రహదారులను వెంటనే బాగు చేయాలని సూచించారు. బుధవారం నుంచి గురువారం ఉదయం వరకు జిల్లావ్యాప్తంగా జోరువానలే కురిశాయి. తడ, సూళ్ళూరుపేట, నాయుడుపేట, గూడూరు, ఆత్మకూరు, అనంతసాగరం తదితర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి.

## సంగమేశ్వరశాస్త్రికి నివాళులు



నెల్లూరులోని వాత్సల్య వ్యవస్థాపకుడు వేదాంతం సంగమేశ్వరశాస్త్రి వర్ధంతి సందర్భంగా మంగళవారం ఆయన విగ్రహానికి పూర్వవిద్యార్థులు, ప్రస్తుత విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అతిథిగా పాల్గొన్న బాలభవన్ డైరెక్టర్ జి.సుభద్రాదేవి మాట్లాడుతూ సుదూరప్రాంతాల నుండి వాత్సల్య పూర్వవిద్యార్థులు ఒక చోటుకు రావడం అభినంద నీయమన్నారు. సంగమేశ్వరశాస్త్రికి ఇదే ఘనమైన నివాళి అన్నారు. పదవ తరగతి, ఇంటర్, ఎంసెట్, ఇంజనీరింగ్ పరీక్షల్లో నిరాధార బాలబాలికలు మంచి ఫలితాలు సాధించడం ఆనందదాయకమన్నారు. ఈ సందర్భంగా వాత్సల్య విద్యార్థి జి.వాణీశ్వరికి అయిదు వేల రూపాయలు నగదు, శాలువాతో సత్కరించారు.

ఈ కార్యక్రమంలో వాత్సల్య జాయింట్ సెక్రటరి టివిఎస్ దుర్గాప్రసాద్, ఎపియుడబ్ల్యూజె రాష్ట్ర కార్యదర్శి ఎ.జయప్రకాష్, ప్రధానోపాధ్యాయులు మధుసూదన్‌రెడ్డి, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


శ్రద్ధాంజలి



శ్రీమతి పందిళ్ళపల్లి అరుణమ్మ గారు
నెల్లూరు జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు

అమ్మలా ఆదరించావు.. అక్కలా అండగా నిలిచావు...
మీ పలకరింపుతో కొండంత ధైర్యానిచ్చావు. అభిమానం, ఆప్యాయతల ప్రతిరూపమైన
మిమ్మల్ని కోల్పోవడం... మాకు తీరని విషాదం.
మీ పవిత్రాత్మకు శాంతిని చేకూర్చమని ఆ కామాక్షమ్మ తల్లిని వేడుకుంటూ...
అశ్రునయనాలతో...

ప్రొప్రైటర్స్: జి.బ్రహ్మయ్య, జి.వేణు
ఫ్యాషన్ స్టైల్ రెడీమేడ్ షోరూం
షాప్ నెం. 13, కో-ఆపరేటివ్ బ్యాంకు కాంప్లెక్స్, గాంధీబొమ్మ, ట్రంకురోడ్డు, నెల్లూరు.


# సమాజసేవే జీవిత పరమార్థం కావాలి

- డాక్టర్ సిహెచ్ శ్రీనివాసరాజు



సమాజసేవే జీవిత పరమార్థంగా భావించి అందరూ తమ చుట్టూవున్న సమాజానికి తమవంతు సేవలందించాలని ప్రముఖ హృద్రోగ వైద్యనిపుణులు డాక్టర్ సిహెచ్ శ్రీనివాసరాజు అన్నారు. బుచ్చిరెడ్డిపాళెంలోని శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం ఆవరణంలో ఈ నెల 14న జరిగిన సత్యశ్రీ సాహితీ పురస్కారాల కార్యక్రమంలో ఆయన పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజానికి సేవ చేయడంలోనే ఎంతో సంతృప్తి వుంటుందన్నారు. ప్రముఖ కవి మాటేటి రత్నప్రసాద్, వారి కుటుంబసభ్యులు కలసి తమ తల్లిదండ్రుల స్మారకార్థం ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో అనేకమంది కవులు, కవయిత్రులు పాల్గొని కవితాపఠనం చేశారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో సేవలందిస్తున్నవారికి సత్యశ్రీ పురస్కారాలను ప్రదానం చేశారు. ప్రముఖ రచయిత్రి శ్రీమతి స్రవంతి ఐతరాజు, బిజెపి నాయకుడు కర్నాటి ఆంజనేయరెడ్డి, పద్యకళాపరిషత్ అధ్యక్షుడు మెట్టు రామచంద్రప్రసాద్, ప్రముఖ పాత్రికేయుడు సంపత్‌కుమార్, 'లాయర్' సబ్‌ఎడిటర్ మద్దూరు శ్రీనివాసులు, వీరేపల్లి లక్ష్మీభవాని, మోపూరు భాస్కరనాయుడు, విజయభరధ్వాజ్‌రెడ్డిలకు సత్యశ్రీ పురస్కారాలను ప్రదానం చేశారు. నెరసం అధ్యక్షుడు ఎ.జయప్రకాష్ అధ్యక్షత వహించగా, టిటిడి ధర్మప్రచారపరిషత్ జిల్లా కన్వీనర్ శ్రీహరి, ప్రొహిబిషన్ సిఐ మార్టూరు శ్రీరామ్ ప్రసాద్, బివి నరసింహం, బాలు సుబ్బారావు పాల్గొన్నారు.

## పినాకినికి దేహసమర్పణ

ఇందుకూరుపేట మండలం నిడుముసలి గ్రామంలో నివాసమున్న కమలమ్మ అనాధగా కాలం చేసింది. దీంతో గ్రామస్తులు ఈ విషయాన్ని పినాకిని దేహసమర్పకుల సంస్థ సభ్యుడు గణేశం కృష్ణారెడ్డి దృష్టికి తీసుకురాగా, ఆమె అంతిమ సంస్కారం గురించి గ్రామస్తులతో చర్చించి వైద్య సేవారంగానికి ఆమె దేహాన్ని అప్పగించాలని తీర్మానించుకున్నారు. ఈ విషయం పినాకిని దేహసమర్పణ సంస్థకు తెలియజేయగా, వారు ఆమె దేహాన్ని నారాయణ వైద్య కళాశాలకు అప్పగించడం జరిగింది. ఈ విషయంపై కృష్ణారెడ్డి, సుబ్బారెడ్డి, వై.రమణారెడ్డి, ఎన్.సోమశేఖర్, గ్రామ పంచాయితి అధ్యక్షులు వై.హైమావతి సంతకాలు చేశారు. ఇది తమ సంస్థ 15వ దేహసమర్పణని ఆ సంస్థ ఆర్గనైజేషన్ ఆర్గనైజర్ తిక్కవరపు సుకుమార్‌రెడ్డి తెలిపారు.

### ఒక కాంట్రాక్టర్ కోసం...

# అన్నదాతల కడుపు కొడతారా?

ఒక కాంట్రాక్టర్ ప్రయోజనాల కోసం వేలాది ఎకరాల రైతుల కడుపుకొడతారా అంటూ నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఇరిగేషన్ అధికారులను నిలదీశారు. రూరల్ పరిధిలోని మాదరాజుగూడూరు, కాకుపల్లి, లింగాయపాలెం రైతులకు రెండో పంటకు సాగునీళ్లు వదలనందుకు నిరసనగా ఈ నెల 18న ఆయన నెల్లూరులోని ఇరిగేషన్ ఎస్ఇ కార్యాలయం మెట్లపై కూర్చుని ధర్నా చేశాడు. సోమశిల డ్యాంలో నీళ్లున్నా, మూడు రోజుల నుండి వర్షాలు పడుతున్నా, కేవలం కాంట్రాక్టర్ పనులకి ఇబ్బంది అని చెప్పి రెండోపంటకు నీళ్లివ్వక పోవడం అన్యాయమని ఆయన ధ్వజమెత్తాడు. వారం క్రితం ఈ ప్రాంత రైతులకు 15క్యూసెక్కుల సాగునీళ్లు అందిస్తామని సంతకాలు తీసుకున్న ఇరిగేషన్ అధికారులు ఎందుకు మాట మార్చి నీళ్లివ్వడం లేదంటూ నిలదీశారు.



జోరువానలో రైతులతో కలిసి ధర్నా చేస్తున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

ధర్నా గురించి తెలిసి ఎస్ఇ అక్కడకు చేరుకుని కోటంరెడ్డితోనూ, ధర్నాకు మద్దతుగా వచ్చిన సిపిఎం నాయకులు మాదాల వెంకటేశ్వర్లుతోనూ చర్చించారు. ఈ నెల 22వ తేదీ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి చర్చించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని ఎస్ఇ హామీ ఇవ్వడంతో కోటంరెడ్డి ధర్నా విరమించాడు.

# బిఎంఆర్‌లో పెరిగిన ఆశలు



రాజ్యసభ ఎన్నికలకు టైం దగ్గర పడుతోంది. ఆశావహుల్లో టెన్షన్ పెరుగుతోంది. ఉండేది నాలుగు సీట్లు. ఇప్పటి లెక్క ప్రకారం తెలుగుదేశంకు దక్కేది మూడు సీట్లు. రాష్ట్రంలోని 13జిల్లాల నుండి కూడా దాదాపు రెండు డజన్ల మంది నాయకులు రాజ్య సభను ఆశిస్తున్నారు. ఈ మూడు సీట్లకు ఏర్పడ్డ పోటీలో నెల్లూరుజిల్లా నుండి బీద మస్తాన్‌రావు, ఆదాల ప్రభాకర్ రెడ్డిల పేర్లు వినిపించాయి. తాజా సమాచారాన్ని విశ్లేషిస్తే మూడు రాజ్యసభ స్థానాల అభ్యర్థుల విషయంలో బీద మస్తాన్‌రావు పేరు పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. బిసిల కోటాలో ఆయనను పెట్టే అవకాశాలున్నాయి. పార్టీ ప్రతిపక్షంలో వున్నప్పుడు అన్ని విధాలా పార్టీకి అండదండలందించినందుకు రాజ్యసభను బహుమతిగా ఇవ్వాలన్న ఆలోచన వున్నట్లు తెలుస్తోంది.

# లాయర్‌కు 'నాటా' ఆహ్వానం



'లాయర్' వారపత్రికకు అమెరికాలోని 'నాటా' సంస్థ నుంచి ఆహ్వానం అందింది. అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రంలో వున్న డల్లాస్ నగరంలో ఈ నెల 27, 28, 29 తేదీల్లో 'నాటా' 3వ ద్వైవార్షిక సమావేశం జరుగుతున్న సందర్భంగా 'నాటి నెల్లూరు - నేటి నెల్లూరు - రేపటి నెల్లూరు' అనే అంశంపై ప్రసంగించేందుకు 'లాయర్' వారపత్రిక సంగ్రాహకులు తుంగా శివప్రభాత్‌రెడ్డికి ఆహ్వానం అందింది. డల్లాస్ కన్వెన్షన్ సెంటర్ వేదికపై ఈ నెల 29న అత్యంత వైభవంగా జరగనున్న నాటా సంబరాల్లో ప్రత్యేకించి నెల్లూరీయుల ఆత్మీయ సమావేశంలో శివప్రభాత్‌రెడ్డి పాల్గొని ఆరోజు మధ్యాహ్నం 2.30 నుంచి 3.30గంటల వరకు నెల్లూరు జిల్లా ప్రాభవ వైభవాలకు సంబంధించిన అనేక విషయాలను వివరించనున్నారు. ప్రాచీనకాలం నుంచి నెల్లూరు వైభవం, ప్రస్తుత ప్రగతి, భవిష్యత్తులో నెల్లూరు అభ్యున్నతికి చేయాల్సిన కృషి వగైరాలను ఆయన ఈ సందర్భంగా తన ప్రసంగంలో ప్రస్తావించనున్నారు. ఎంతో ప్రతిష్టాత్మకమైన ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఈ నెల 22న బయలుదేరి ఆయన అమెరికా వెళ్తున్నారు. ఈ సమావేశంలో అమెరికా వైఎస్ఆర్‌గా పిలువబడే ప్రఖ్యాత వైద్యులు, పుట్టిన వూరైన నెల్లూరుజిల్లా నిడిగుంటపాళెం అభివృద్ధికి అనేక సేవలందిస్తోన్న సమాజసేవాతత్పరుడు డాక్టర్ ప్రేమ్‌సాగర్‌రెడ్డి, ప్రఖ్యాత పారిశ్రామికవేత్త, శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవి సన్నారెడ్డి తదితరులతో పాటు, నెల్లూరుకు చెందిన పలువురు ప్రముఖులు, అమెరికా రాష్ట్రాలలో నివసిస్తున్న అనేకమంది నెల్లూరీయులు పాల్గొననున్నారు.

# అలరించిన ఆదిశంకర జయంత్యుత్సవాలు

స్వర్గీయ స్వయంపాకుల వేంకటశేషశాస్త్రి స్థాపించిన శ్రీ పినాకిని విద్యాపీఠం ఆధ్వర్యంలో జగద్గురు శ్రీశ్రీశ్రీ ఆదిశంకర జయంత్యుత్సవాలు, 70వ వార్షికోత్సవం ఈ నెల 11నుంచి 15వ తేదీ వరకు ఐదురోజుల పాటు నెల్లూరు ట్రంకురోడ్డు లోని టివిఎస్ కళ్యాణసదన్‌లో వైభవంగా జరిగాయి. ప్రతిరోజూ జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య మహాసంస్థానాధీశ్వరులు శ్రీ విద్యారణ్య భారతీ స్వామిచే అనుగ్రహభాషణ జరిగింది.



శ్రీ విద్యారణ్య భారతీ స్వామిని సత్కరిస్తున్న పినాకిని విద్యాపీఠం అధ్యక్షులు స్వయంపాకుల శ్రీనివాసులు

11వ తేదీ సాయంత్రం శివానందలహరి - అద్వైతార్థము అంశంపై తెనాలి విశ్రాంత తెలుగురీడర్ బ్రహ్మశ్రీ డాక్టర్ ములుకుట్ల బ్రహ్మానందశాస్త్రి ఉపన్యసించారు. 12వ తేదీ సాయంత్రం వైణిక విద్వాంసులు శ్రీకంఠం నాగలక్ష్మి, పాలేటి హేమలక్ష్మి, కంఠంరాజు పద్మాచక్రవర్తి త్రయం వీణకచ్చేరి వీనులవిందుగా సాగింది. వీరికి మృదంగ సహకారాన్ని చిట్టి హరిప్రసాద్ అందించారు. 13వతేదీ సాయంత్రం శ్రీశంకర విరచిత శ్రీ మాతా వైభవంపై విజయవాడ మారిస్‌స్టెల్లా కళాశాల సంస్కృత శాఖాధ్యక్షులు మాన్యశ్రీ డాక్టర్ ధూళిపాళ రామకృష్ణ ఉపన్యసించి ఆకట్టుకున్నారు. 14వ తేదీ సాయంత్రం శ్రీ శంకర విరచిత శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్ర భాష్యంపై నెల్లూరు వేదసంస్కృత కళాశాల తెలుగురీడర్ డాక్టర్ కె.గిరిజాలక్ష్మి ఉపన్యసించారు. 15వతేదీ సాయంత్రం వేద సంప్రదాయ వైభవంపై విజయవాడ శ్రీ వైఖానస ఆగమ పరిషత్ అధ్యక్షులు శ్రీమాన్ వేదాంతం రాజగోపాల్ చక్రవర్తి ఉపన్యసించారు. ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు చతుర్వేద పండితులచే వేదస్వస్తి, వేదాశీర్వచనములచే వేద సభ జరిగింది. ఉపన్యాసకులను, వైదిక విద్వాంసులను శ్రీవిద్యారణ్య భారతీ స్వామి ఘనంగా సత్కరించారు. చివరిరోజు శ్రీవిద్యారణ్య భారతీస్వామి వారిని పినాకిని విద్యాపీఠం సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమాలను శ్రీ పినాకిని విద్యాపీఠం అధ్యక్షులు స్వయంపాకుల శ్రీనివాసులు, కార్యదర్శి దూబగుంట ప్రభాకరరావు, సహాయకార్యదర్శి చక్రాల వెంకటలక్ష్మీ నరశింహం, సభ్యులు స్వయంపాకుల సుందరరామశర్మ, స్వయంపాకుల సుబ్రహ్మణ్యం, ఇస్కపల్లి కామేశ్వరప్రసాద్, పెనుగొండ వెంకటేశ్వర్లు, తొండపి శ్రీనివాసరావు, కొండూరు ఉమామహేశ్వరయ్య, యనమండ్ర నాగదేవిప్రసాద్, ములుగు బాలత్రిపుర సుందరి పర్యవేక్షించారు.




# టోల్‌పై అఖిలపక్ష పోరు



రాస్తారోకో నిర్వహిస్తున్న అఖిలపక్ష నాయకులు

నెల్లూరు శివార్లలో కొండాయపాళెం వద్ద నిర్మించతలపెట్టిన టోల్‌ప్లాజాను రద్దు చేసే దాకా ఉద్యమం ఆగదని అఖిల పక్ష నాయకులు స్పష్టం చేశారు. సోమవారం ఆ మేరకు వారంతా బుజబుజనెల్లూరు హైవే వద్ద పెద్దఎత్తున 'మహా రాస్తారోకో' నిర్వహించారు. హైవేపై బైఠాయించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ఇక్కడ టోల్‌ప్లాజా నిర్మాణం వల్ల నగరంలో ట్రాఫిక్‌కు ఇబ్బందవుతుందని, ప్రమాదాలు కూడా జరిగేందుకు అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్, డిసిసి జిల్లా అధ్యక్షుడు పనబాక కృష్ణయ్య, మేయర్ అబ్దుల్ అజీజ్, సిపిఎం నాయకుడు బివి రమణారెడ్డి, కాంగ్రెస్ నాయకులు సివి శేషారెడ్డి, చేవూరు దేవకుమార్‌రెడ్డి, టిడిపి నగర అధ్యక్షుడు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, వైఎస్సార్సీపి నాయకులు రూప్‌కుమార్‌యాదవ్, తాటి వెంకటేశ్వర్లరావు, సుధీర్‌బాబు, సిపిఎం నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, సిపిఐ నాయకులు అరిగెల సాయి, రామరాజు, లోక్‌సత్తా నాయకులు అంకయ్యచౌదరి తదితరులు పాల్గొన్నారు. రాస్తారోకో సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నగర డిఎస్పీ జెవి రాముడు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



## 'ప్రభా'తం

# తెలంగాణ దాంగాటు

**నవ్యాంధ్ర పరిస్థితి దయనీయంగా మారింది. ప్రగతి కుంటుబడి పోయింది. వస్తుందనుకున్న ప్రత్యేక హోదా రానే లేదు. కేంద్రం ఇస్తుందనుకున్న భారీ నిధులొచ్చిందీ లేదు. వేలాది కోట్ల లోటు బడ్జెట్ పూడే మార్గం తెలియక, రాజధాని నిర్మాణం కూడా పూర్తికాక లబోదిబోమంటుంటే.. గోరుచుట్టుపై రోకటిపోటన్నట్లుగా మధ్యలో తెలంగాణ ప్రాజెక్టుల వ్యవహారం రాష్ట్రాన్ని మరింత బెంబేలెత్తిస్తోంది. ఇకనైనా కేంద్రం జోక్యం చేసుకుని అన్నివిధాలా నష్టపోయిన ఆంధ్రకు న్యాయం చేయాల్సివుంది.**

తగిలిన కాలికే మళ్ళీ మళ్ళీ దెబ్బ తగులుతుందనే చందంగా.. రాష్ట్ర పరిస్థితి నానాటికీ దయనీయంగా తయారవుతోంది. ఇప్పటికి జరిగిన అన్యాయాలు చాలక..మళ్ళీ మళ్ళీ అన్యాయాలు జరుగుతూనే వున్నాయి. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కానీ, ఇస్తామన్న ప్రత్యేక నిధులు కానీ ఏవీ రాక లబోదిబోమంటుంటే, గోరుచుట్టుపై రోకటి పోటన్నట్లుగా తెలంగాణ వ్యవహరిస్తోంది. ఎగువప్రాంతాల్లో అనుమతిలేకుండానే తెలంగాణ నీటి ప్రాజెక్టులు కడుతుండడం వల్ల భవిష్యత్తులో రాష్ట్రం ఎడారైపోతుంది మహాప్రభో.. అని ఇక్కడి నాయకులు ఆందోళనలు చేస్తున్నా పట్టించుకునేవారే లేరు. విభజన కష్టాలు ఆంధ్రకు కడివెడు కన్నీళ్ళు పెట్టిస్తూనే వున్నా కనీసం ఓదార్చే నాధులే వుండడం లేదు. ఒకవైపు రాష్ట్ర ప్రగతి కుదేలై కూర్చుంది. ఆదుకుంటామని అప్పట్లో మాటిచ్చినవారు ఆదుకోకుంటే..ఇంతకాలం ఆశలు పెట్టుకున్న ప్రజల పరిస్థితి మాత్రం అగమ్యగోచరంగా వుంది. విభజనతో వేలాది కోట్ల రూపాయల లోటుబడ్జెట్ ఒకవైపు, సరైన పాలన జరుపుకోవడానికి కనీసం రాజధాని కూడా లేకుండా దిక్కులేని స్థితి ఇంకోవైపు.. నిధులు లేక నీరసపడివున్న నవ్యాంధ్ర కష్టాల సుడిగుండంలో పడిపోయినా ఏలినవారికి మనసు కరగకపోవడం ఆంధ్ర దురదృష్టమేననాలి. అయినా, హోదా ఇస్తే ఏం ఉపయోగం..నిధులివ్వాలి కదా?.. నిధులివ్వకుండా హోదా ఎందుకంటా?.. అనేవిధంగా మాటలు మారుతుండడం రాష్ట్ర ప్రజానీకాన్ని మరింత బాధిస్తోంది. రాష్ట్రానికి ప్రత్యేక హోదాతో పాటు, రాష్ట్రాభివృద్ధికి అవసరమైన నిధులన్నీ ఇచ్చి, కష్టాల్లో మీ వెంటే మేమున్నాం.. అంటూ భరోసా ఇచ్చి పెద్దమనసుతో ఆదుకోవాల్సిన తరుణంలో నాయకులింకా మీనమేషాలు లెక్కబెడుతుండడం రాష్ట్రానికి పట్టిన దురదృష్టం కాక మరేమిటి? అయినా, రాష్ట్రాభివృద్ధికి ఇస్తామన్న నిధుల్లో ఇప్పటిదాకా కేంద్రం ఇచ్చిన నిధులు కూడా చాలా తక్కువే. లోటు బడ్జెట్తో ప్రగతి కుంటుబడి, నిధుల లేమితో అష్టకష్టాలుపడుతున్న రాష్ట్రాన్ని తక్షణం ఆదుకోవాల్సిన నేతలు నిధుల కేటాయింపు విషయంలోనూ రాష్ట్రానికి ఆశించిన న్యాయం చేయకపోవడం మరింత బాధాకరం. ఈ నేపథ్యంలో ఇక పోలవరం వంటి భారీ ప్రాజెక్టులు పూర్తయ్యేదెప్పుడో..వారికే తెలియాలి. అసలు, పరిపాలనకు గుండెకాయలాంటి రాజధాని పరిస్థితే ఇంకా ఒక కొలిక్కి రాలేదు. రాజధాని నిర్మాణం ఎప్పటికి పూర్తవుతుందో తెలియదు..ఎప్పటికి ఈ రాష్ట్ర సమస్యలు తీరుతాయో అంతా అగమ్యగోచరం. ఈ పరిస్థితుల్లో పుట్టెడు కష్టాలతో వున్న నవ్యాంధ్ర నిలదొక్కుకునేదెప్పుడు?..ప్రగతి బండి కదిలేదెప్పుడు?..అన్నీ ప్రశ్నలే..సమాధానాలే కరువు. అయినా, ఇవన్నీ నేతలకు తెలియనివేమీ కాదు. ప్రతిదానికీ రాజకీయ ప్రయోజనాలను లెక్కగట్టి చూస్తుండడం వల్లే ఈ పరిస్థితి దాపురిస్తోందనే అభిప్రాయాలు ప్రజల్లో సర్వత్రా వినవస్తున్నాయి. ఈ దుస్థితి ఇలా వుంటే, గోరుచుట్టుపై రోకటి పోటన్నట్లు, అటు తెలంగాణ ప్రభుత్వం ఎగువ ప్రాంతాల్లో అనుమతి లేకుండా పలు నీటి ప్రాజెక్టులు కడుతుండడం వల్ల రానున్న రోజుల్లో ఆంధ్రకు చుక్కనీరు కూడా దొరకడం కష్టమని, భవిష్యత్తులో రాష్ట్రం ఎడారి కావడం తథ్యమని ఇక్కడి నాయకులు తీవ్రంగా ఆందోళనలు చేస్తున్నా పట్టించుకునేవారు లేరు. అయితే, ఇవేమీ అక్రమం కాదు..సక్రమమే అంటూ తెలంగాణ మాత్రం ధీమాగా తన పని తాను చేసుకుపోతోంది. దీంతో ఆంధ్ర పరిస్థితి పిల్లికి చెలగాటం.. ఎలుకకు ప్రాణ సంకటం అన్నట్లుగా తయారైంది. విభజనకు ముందురోజుల్లోనే నీటిప్రాజెక్టుల పరిస్థితిపై అప్పట్లో భారీ చర్చలే జరిగాయి. ఈ ప్రాజెక్టుల విషయంలో ఎంతో అప్రమత్తంగా వుండాలని, అన్నిటినీ ముందే సరిచూసుకొని నిర్ణయాలు తీసుకోకుంటే ఇలాంటి దుస్థితి తప్పదని అప్పట్లో నేతలు మ్యాప్‌లు వేసి చూపించి మరీ చెప్పారు. అందరూ భలేగా విన్నారే తప్ప..ఇంత ఘోరం జరుగుతుందని అప్పుడనుకోలేదు. ఇప్పుడు సరిగ్గా ఆంధ్రకు అదే దుస్థితి దాపురించేలా వుంది. కాకి అరుస్తూనే వుంటుంది..కరవాడ ఎండుతూనే వుంటుందన్నట్లుగా..మన నాయకులు అరుస్తూనే వుంటారు..అక్కడ జరిగేది మాత్రం జరిగిపోతూనే వుంటుంది. ఇదీ నవ్యాంధ్ర దుర్గతి. ఆంధ్రకు ఇలా అన్యాయం మీద అన్యాయం జరుగుతూనే వున్నా.. ఇక్కడి నేతలు మాత్రం ఇంకా..ఎవరి రాజకీయాలు వారివి అన్నట్లుగానే వ్యవహరిస్తుండడం మరింత విచారకరం. వీరి చిత్తశుద్ధి లేని రాజకీయాల వల్ల చివరికి నష్టపోయేది ప్రజలే. ఇవన్నీ అవతలివారికి బాగా కలిసొచ్చే అంశాలుగా వుంటున్నాయే తప్ప ఇక్కడి ప్రజలకు ఒరిగే ప్రయోజనమేమీ వుండడం లేదు. ఏదేమైనా, తెలంగాణ అక్రమంగా కడుతోందని అంటున్న ఆ నీటి ప్రాజెక్టుల విషయాన్ని వెంటనే పరిశీలించి ఏది ఎంతవరకు న్యాయమో తేల్చాల్సింది కేంద్రమే. ఈ ప్రాజెక్టుల విషయంలో పూర్తిస్థాయిలో కేంద్రం జోక్యం చేసుకుని న్యాయం చేస్తే తప్ప ఆంధ్రకు న్యాయం జరగదని ప్రత్యేకించాల్సిన అవసరమే లేదు. ఒక్క... నీటి ప్రాజెక్టుల విషయంలోనే కాదు, ఆంధ్రకు ఇచ్చే నిధుల విషయంలోనూ, ప్రత్యేక హోదా విషయంలోనూ, రాష్ట్రాభ్యున్నతికి అవసరమైన ప్రతి చిన్న విషయంలోనూ కూడా కేంద్రం సాయమే ఆంధ్రకు ఆధారం. అడ్డగోలు విభజనతో అన్నిందాలా నష్టపోయిన రాష్ట్రాన్ని అన్నివిధాలా ఆదుకోవాల్సింది కేంద్రమేనన్నది అందరికీ తెలిసిన విషయమే. ముఖ్యంగా, ఆంధ్రను ఆదుకుని న్యాయం చేస్తామని అప్పట్లో భరోసా ఇచ్చిన ప్రధాని నరేంద్రమోడీ పుట్టెడు కష్టాల్లో వున్న నవ్యాంధ్రను గట్టెక్కించేందుకు పూర్తిస్థాయిలో అదుకుంటారనే గట్టి విశ్వాసం నవ్యాంధ్ర ప్రజల్లో నిండుగా వుంది. అందుకే ఎవరెన్ని రకాలుగా వ్యాఖ్యానిస్తున్నా...వాటన్నిటినీ ప్రధాని పక్కనపెట్టి..రాష్ట్రానికి త్వరలోనే ప్రత్యేక హోదా ప్రకటించి, అవసరమైన నిధులిచ్చి..నవ్యాంధ్రను ప్రగతిమార్గం పట్టించేందుకు ప్రధాని మోడీ తప్పకుండా కృషి చేస్తారని ప్రజలంతా మనసావాచా విశ్వసిస్తూ... ఆ రోజు కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నారు.

# ఉద్యాన పంటలకు ప్రాధాన్యత

## - వ్యవసాయ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు




సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

రైతుల శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయమని, అందుకే రాష్ట్రంలో ఉద్యాన పంటలకు బాగా ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులకు మరింత ఆదాయాన్ని సమకూర్చేవిధంగా ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటోందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ఈ నెల 14న నెల్లూరు కలెక్టరేట్‌లోని గోల్డన్‌జూబ్లీ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో ఆయన జిల్లా అధికారులతో సమావేశమై వ్యవసాయ పరిస్థితులను సమీక్షించారు. రాష్ట్రంలో 16.25 లక్షల హెక్టార్లలో ఉద్యాన పంటలు, 43 లక్షల హెక్టార్లలో వ్యవసాయ పంటలు సాగులో వున్నాయని తెలిపారు. అయితే, వ్యవసాయ పంటలను 10లక్షల హెక్టార్లు తగ్గించి, వాటి స్థానంలో ఉద్యాన పంటలు సాగయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నామని, ఇలా చేయడం వల్ల రైతులకు ప్రయోజనం వుంటుందని ఆయన అన్నారు. ఒక్కో జిల్లా నుంచి కనీసం 30 నుంచి 40 వేల హెక్టార్లలో ఉద్యాన పంటల విస్తీర్ణాన్ని పెంచాలని నిర్ణయించామన్నారు. వ్యవసాయంతో పాటు మత్స్య పెంపకానికి, ఆక్వా సాగుకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఫిష్ పాలసీని తీసుకువచ్చి ఆక్వా, చేపల సాగు రైతుల ప్రయోజనాలను పరిరక్షిస్తామన్నారు. రాష్ట్రంలో 8.11 లక్షల టన్నుల ఎరువులున్నాయని, జిల్లాలోనూ ఎరువుల కొరత లేదని, ఖరీఫ్, రబీ సీజన్లకు అవసరమయ్యే ఎరువులు పుష్కలంగా వున్నాయని ఆయన అన్నారు. జిల్లాలో పంట కుంటలను పంచాయతీకి వంద చొప్పున నిర్మించాలని ఆదేశించారు. వర్షాభావ పరిస్థితుల్లో పంటలు ఎండిపోకుండా ఈ కుంటలు ఉపయోగపడతాయన్నారు. ఎన్ఆర్ఈజిఎస్ పథకం కింద ఈ కుంటల నిర్మాణాన్ని వ్యవసాయశాఖ, ఉద్యానశాఖ అధికారులు ఏర్పాటు చేయించాలన్నారు. ఈ సమావేశంలో మంత్రి నారాయణతో పాటు, జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎఎండి ఇంతియాజ్, వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, రాజధాని కమిటీ సభ్యుడు బీద మస్తాన్‌రావు, నగర మేయర్ అబ్దుల్ అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీ చదరంగ ఛాంపియన్‌గా నెల్లూరోడు

న్యూఢిల్లీలోని కశ్మీర్‌గేట్ వద్ద ఉన్న లుడ్లో క్యాసిల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు జరిగిన అంతర్జాతీయ ఫిడే రేటింగ్ చెస్ టోర్నీలో నెల్లూరు క్రీడాకారుడు వై.సుమన్ విజేతగా నిలిచాడు. 79వ సీడ్ ఆటగాడిగా సుమన్ బరిలో దిగి స్విస్ సిస్టంలో 9రౌండ్లుగా జరిగిన టోర్నీలో ఎత్తుకుపైఎత్తులు వేస్తూ 8.5పాయింట్లు సాధించి ఛాంపియన్‌గా నిలిచాడు. రూ.1.25లక్షల ప్రైజ్‌మనీ సాధించాడు. సుమన్‌ను "ఢిల్లీ చెస్ బాద్షా"గా టోర్నీ నిర్వాహకులు ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ కార్యదర్శి డి.హరి, నెల్లూరు జిల్లా చెస్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరి యశ్వంత్‌సింగ్, కోశాధికారి హమీద్ సుమన్‌ను అభినందించారు.




# ప్రభుత్వవిద్యను బ్రతికించండి

ఆంధ్రప్రదేశ్‌లో విద్యావ్యవస్థ భ్రష్టుపట్టిపోయింది. చదువులను కొనుక్కోవాల్సి వస్తోంది. ఎంత డబ్బుకు అంత చదువు అన్నట్లుగా పరిస్థితులు మారాయి. ప్రభుత్వాలు కూడా విద్యావ్యవస్థను పూర్తిగా ప్రైవేట్ పరం చేశాయి. రాష్ట్రంలో కొన్ని వేల స్కూళ్లు... కొన్ని లక్షల మంది టీచర్లు... కోట్లలో జీతాలు... ఏం లాభం... సర్కార్ బళ్లల్లో పిల్లలుంటేగా...? 50అంకణాల స్థలంలో అగ్గిపెట్టెల్లాంటి క్లాసు గదుల్లో ప్రైవేట్ విద్యాసంస్థలు నడుస్తున్నా వాటిలో గుట్టలు గుట్టలుగా చేరుతున్నారు. ఇక ఎంసెట్ పేరుతో నారాయణ, చైతన్య వంటి విద్యాసంస్థల దోపిడీకి అడ్డేలేదు. వీళ్లకు ప్రభుత్వ అండదండలు పుష్కలంగా ఉన్నాయి. నవ్యాంధ్ర విద్యాపరిరక్షణ సమితి పేరుతో ఏర్పడ్డ సంస్థ తమ పోరాటంతోనైనా ఈ వ్యవస్థలో మార్పు తీసుకురావాలి. ముఖ్యంగా ప్రభుత్వ స్కూళ్లు, కాలేజీలకు పూర్వవైభవం తీసుకొస్తే సామాన్య, మధ్యతరగతి ప్రజలకు చాలా భారం దిగినట్లే!

**- టి.సదాశివం, నెల్లూరు.**

## విషప్రచారం మానండి

మీడియా సంస్థలలో ఎక్కువ మంది కమ్యూనిజం భావాలు ఉన్నవాళ్ళే! కాబట్టి తమ మెదళ్లలో ఉండేదే వీళ్లు ప్రజాభిప్రాయంగా చూపిస్తుంటారు. అది చాలా తప్పు. సమాజం దృష్టితో వార్తలు ఇవ్వండి. ఈమధ్య హైందవ సంస్కృతి మీద మీడియాలో విష ప్రచారం ఎక్కువైంది. మూఢనమ్మకాలు, వితండవాదనలు అన్ని మతాలలోనూ ఉన్నాయి. వీళ్లకు ధైర్యం ఉంటే హిందూమతంలో లాగే ఇతర మతాలలో వున్న మూఢ విశ్వాసాలపై వార్తలు ప్రచారం చేయండి... మీ టీవీ ఆఫీసులు ధ్వంసం కాకపోతే చూడండి.

**సి.రాజీవి, నెల్లూరు.**

## విద్యార్థులతో ఆడుకోవద్దు

అటు సుప్రీంకోర్టు, ఇటు ప్రభుత్వాలు విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నాయి. మెడికల్ కోర్సులో ప్రవేశానికి 'నీట్' తప్పనిసరి అని సుప్రీంకోర్టు అంటే, ఈ ఏడాదికి అవసరం లేదని రాష్ట్ర ప్రభుత్వం ఎంసెట్ నిర్వహించింది. సుప్రీంకోర్టు అయినా విద్యా సంవత్సరం ఆరంభంలోనే నీట్ తప్పనిసరి చెప్పి ఉండాల్సింది. ఇప్పుడు విద్యార్థులు ఏది వ్రాయాలో ఏది వ్రాయకూడదో తెలియక త్రిశంకుస్వర్గంలో వున్నారు.

**నిమ్మకాయల సతీష్, హైదరాబాద్.**

# హోదా రాకుంటే... మొదటి నష్టం నెల్లూరుకే!




**ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా పెద్ద చర్చనీయాంశమైంది. రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇచ్చేది లేదని కేంద్రం ఖరారుగా చెప్పేసింది. రాష్ట్ర విభజన సమయంలో ఏపి ప్రజలు ఎంతగా బాధపడ్డారో, ఇప్పుడు హోదా లేదని చెప్పాక కూడా అంతే బాధ పడుతున్నారు. కేంద్రంలో ఏ పార్టీ ప్రభుత్వం పాలన సాగిస్తున్నా ఆంధ్రప్రదేశ్‌కు మొండిచేయి సాధారణమేనని దీంతో తేలిపోయింది.**

విభజన తర్వాత రాష్ట్ర పరిస్థితి అగమ్యగోచరంగా వుంది. చంద్రబాబు పరిపాలన రాష్ట్రాన్ని మరింత అధ్వాన్న స్థితిలోకి తీసువెళుతోంది. ప్రత్యేక హోదా ఇచ్చివుంటే కనీసం పారిశ్రామిక రంగంలోనన్నా కొంత కదలిక ఉండేది. ఇప్పుడు అది కూడా చచ్చుబడిపోయినట్లే!

రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇవ్వకుంటే మొదట నష్టపోయేది నెల్లూరే! రాష్ట్రంలోని 13జిల్లాల్లో పారిశ్రామికంగా శరవేగంగా అభివృద్ధి చెందుతున్నది నెల్లూరుజిల్లానే! ప్రత్యేక హోదా ఇచ్చివుంటే తెలంగాణ, తమిళనాడు, కర్నాటకలతో పాటు ఉత్తరభారతంలోని కొన్ని రాష్ట్రాల నుండి కూడా ఎన్నో పరిశ్రమలు నెల్లూరుకు తరలివచ్చేవి. మరెన్నో కంపెనీలు తమ పరిశ్రమలను ఇక్కడ స్థాపించడానికి ముందుకొచ్చేవి. ఈరోజు పరిశ్రమలు నెలకొల్పడానికి అనువుగా వున్నది ఈ జిల్లానే! కృష్ణపట్నం పోర్టుతో రవాణా సౌకర్యం, పరిశ్రమల ఏర్పాటుకు ఆ సెజ్‌లోనే భూములు లభించడం అనుకూలంగా చెప్పుకోవచ్చు. ఇక తడ వద్ద శ్రీసిటీ సెజ్ పరిశ్రమల ఏర్పాటుకు అత్యుత్తమ సెజ్‌గా గుర్తింపు పొందింది. రాష్ట్రానికి ప్రత్యేకహోదా వస్తే ఎక్కువుగా తమిళనాడు పరిశ్రమలు ఇక్కడకు తరలివచ్చే అవకాశముంది. ఇంకా మేనకూరు సెజ్, అపాచి, ఇఫ్‌కో సెజ్, చింతవరం సెజ్‌లు పరిశ్రమల స్థాపనకు అనుకూలంగా వున్నాయి. పరిశ్రమల ఏర్పాటుకు కావాల్సిన భూములున్నాయి. ప్రజలతో ఇబ్బంది లేదు. రవాణా సౌకర్యాలున్నాయి. ఉద్యోగుల నివాసానికి, సిబ్బందికి కొరత లేదు. కావాల్సిందల్లా పారిశ్రామికంగా ఎన్నో రాయితీలు కల్పించే ప్రత్యేకహోదానే! ఇది వస్తే నెల్లూరుజిల్లా పారిశ్రామికంగా పరుగులు తీయడం ఖాయం.



## ● నాడు కట్టారు... నేడు కొట్టారు!

# ప్రజాధనం రోడ్ల పాలు

***తలా తోక లేకుండా చేసే పనులకు ఎంత ప్రజాధనం దుర్వినియోగమవుతుందన్నదానికి నెల్లూరులోని విగ్రహాల ఐలాండ్‌లే ఒక ఉదాహరణ. నగరాన్ని అందంగా కనిపించేలా చేయడానికి వివిధ ఆకృతులతో ఐలాండ్‌లు నిర్మించడం వరకు ఓకే! అయితే ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించని రీతిలో ఐలాండ్‌లు ఉండాలి. రోడ్లు వెడల్పుగా వుండి, ట్రాఫిక్ సాఫీగా పోతుంటే ఐల్యాండ్ ఎంత పెద్దదున్నా ఇబ్బంది లేదు.***

కాని నెల్లూరులో రోడ్లు ఉండేదే అంతంత మాత్రం. ఆక్రమణలతో రోడ్లు మూసుకుపోయాయి. వీటికి తోడు రోడ్ల మధ్యలో ఐలాండ్‌లు... వీటి వల్లే ట్రాఫిక్ సమస్యలు.

గత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆనం వివేకానందరెడ్డి నెల్లూరును ఒంటి చేత్తో ఏలుతున్నప్పుడు నగరంలో వున్న ఐలాండ్‌లన్నింటిని అందంగా ముస్తాబు చేయించారు. గాంధీబొమ్మ, నెహ్రూబొమ్మ, ఇందిరమ్మ బొమ్మ, ఆనం వెంకురెడ్డి, గాంధీ, అంబేద్కర్, పూలే, ఏ.సి.సుబ్బారెడ్డి, వై.యస్., రాజీవ్‌గాంధీ... ఇలా చాలా ఐలాండ్‌లను పెద్దవిగా చేశారు. వాటర్ ఫౌంటేన్‌లు, గార్డెనింగ్, బొమ్మలు వంటి వాటితో వాటిని ఆకర్షణీయంగానే తీర్చిదిద్దారు. అయితే ఆ ఆకర్షణలు, తళుకు బెళుకులు తాత్కాలికమే అయ్యాయి. వాటర్ ఫౌంటేన్‌లు తుప్పుపట్టాయి. ఐలాండ్‌లు మాత్రం ట్రాఫిక్‌కు పెద్ద అడ్డయ్యాయి.

నెల్లూరు ట్రాఫిక్‌ను సరిదిద్దేక్రమంలో ఎస్పీ విశాల్‌గున్నీ ఈ ఐలాండ్‌లను తగ్గించే పనికి శ్రీకారం చుట్టడం తెలిసిందే! నగరంలో మొత్తం 14 ఐలాండ్‌లను కుదించాలని నిర్ణయించారు. కొన్ని విగ్రహాల ఐలాండ్‌లను తగ్గించొద్దంటూ కొన్ని సంఘాల వాళ్లు ఆందోళన చేసినా ఎస్పీ లెక్కపెట్టలేదు. విగ్రహాల పేరుతో వితండవాదాలు చేయొద్దంటూ గట్టిగానే చెప్పారు. ట్రాఫిక్ ఐలాండ్‌లను తగ్గించే పని తొందరలోనే పూర్తి కావచ్చు.

అయితే ఇక్కడ బాధల్లా ఒక్కటే... ఐలాండ్‌లను పెంచడానికీ ప్రజాసొమ్మే దుర్వినియోగమైంది, ఇప్పుడు కుదించడానికి వారి సొమ్మే వాడాల్సి వచ్చింది. పాలకుల ఆనాలోచిత నిర్ణయాలకు ప్రజల సొమ్ము ఈ విధంగా రోడ్ల పాలవుతోంది.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు



Estd.1979

N.B.K.R.
INSTITUTE OF SCIENCE & TECHNOLOGY
(AUTONOMOUS)
Affiliated to JNTUA, Anantapuramu.
VIDYANAGAR - 524413 , SPSR Nellore Dt., A.P.
www.nbkrist.org

• Re- Accredited By NAAC(UGC) With "A" Grade
• College With Potential for Excellence (CPE)
• Courses Accredited By NBA Thrice
• Autonomous Institution
• Year-Wise separate Hostel facility
• College Bus facility

MECHANICAL / CIVIL / CSE / ECE / EEE

EAMCET CODE
NBKR

Admission Helpline
08624-228247,
9441572755


Nedurumalli Ram Kumar
CORRESPONDENT

# విద్యార్థులకు డబుల్‌డోస్



ఎంసెట్టా... నీటా... మెడికల్ కళాశాలలో ప్రవేశాలకు ఏ పరీక్ష ఫలితాలను ప్రామాణికంగా తీసుకుంటారో అర్థంకాక విద్యార్థులు తల్లడిల్లుతున్నారు. ఒకవైపు ఎంసెట్ కోచింగ్ అయిపోయింది. దాని ఫీజుల రూపంలో చేతి చమురు వదిలింది. ఇక చదువు పేరుతో రేయింబవళ్లు కష్టపడడమూ అయిపోయింది. ఇప్పుడు సుప్రీం కోర్టు మెడికల్ కళాశాలలో ప్రవేశాలకు 'నీట్' తప్పనిసరి అని చెప్పడంతో మెడికల్ విద్యార్థులంతా కూడా మళ్లీ సెకండ్ ఇన్నింగ్స్ మొదలు పెట్టారు. ఎంసెట్ కోచింగ్ పేరుతో వేలరూపాయలు ఖర్చు చేయగా, మళ్లీ ఇప్పుడు 'నీట్' శిక్షణ కోసం వేలకువేలు ఖర్చు పెట్టాల్సి వస్తోంది. అంతేనా... మళ్లీ విద్యార్థులకు పుస్తకాలను తిరగేయడం, పరీక్ష రాయడం... అంతా డబుల్‌డోస్ అయ్యింది. అప్పుడే ఆయా విద్యాసంస్థలు 'నీట్' కోచింగ్‌ను ప్రారంభించి వేలల్లో ఫీజుల దండకాలు మొదలు పెట్టాయి.

జిల్లాలో మెడికల్‌కు సంబంధించి 4809మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 4700మంది ఎంసెట్ రాయడం జరిగింది. అయితే సుప్రీంకోర్టు తీర్పు ఫలితంగా ఎంసెట్ ఫలితాలను వెల్లడించలేదు. ఇంకో పక్క 'నీట్'కు కూడా సన్నాహాలు జరుగుతుండడంతో ఎటుపోయి ఎటొస్తుందోనని విద్యార్థులు దానికి కూడా సిద్ధమవుతున్నారు. అయితే ఎంసెట్ కోచింగ్‌కు ఫీజులు దండిన విద్యాసంస్థలు అదే విద్యార్థుల నుండి మళ్లీ 'నీట్' కోచింగ్ పేరుతో ఫీజులు దండుతున్నాయి. ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చినట్లు సుప్రీం, ప్రభుత్వాల మధ్య పరీక్షల వివాదం విద్యార్థులను ఉట్టికి, స్వర్గానికి మధ్యలో పెట్టింది.

# దాతల 'వాత్సల్యం'




వాత్సల్యకు విరాళం చెక్కును అందజేస్తున్న మోహన్‌రావు

నెల్లూరు శ్రీ శివసాయి ప్రవీణ్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్టు అధ్యక్షులు గోవర్ధనం మోహన్‌రావు సోమవారం వాత్సల్య సంస్థ ఆర్గనైజింగ్ సెక్రటరి జి.వి.సాంబశివరావుకు లక్ష రూపాయలు విరాళాన్ని చెక్కు ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న బాలభవన్ డైరెక్టర్ జి.సుభద్రాదేవి మాట్లాడుతూ నిరాధార బాలబాలికలను ఆదుకోవడానికి ఎందరో ముందుకు రావడం అభినందనీయమన్నారు. వాత్సల్య విద్యార్థులు అన్ని రంగాల్లో తమ ప్రతిభాపాటవాలను ప్రదర్శించడం సంతోషదాయకమన్నారు. వాత్సల్య ఆర్గనైజింగ్ సెక్రటరి జి.వి.సాంబశివరావు మాట్లాడుతూ వాత్సల్యకు ప్రభుత్వపరమైన నిధులు లేవని, దాతల సహాయ సహకారాలతోనే సంస్థను నిర్వహిస్తున్నామన్నారు. పేరుకు నిరాధార బాలబాలికలైనా పదవ తరగతి, ఇంటర్, ఎంసెట్, ఇంజనీరింగ్ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించారన్నారు. కార్యక్రమంలో శ్రీ శివసాయి ప్రవీణ్ ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు జలజమ్మ, సుదర్శనరావు, వాత్సల్య జాయింట్ సెక్రటరి టివిఎస్ దుర్గాప్రసాద్, ఏపియుడబ్ల్యుజె రాష్ట్ర కార్యదర్శి ఎ.జయప్రకాష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సివిల్స్ ర్యాంకర్‌కు అభినందనలు



సాయిచైతన్యను సత్కరిస్తున్న నేస్తం ఫౌండేషన్

ఇటీవల సివిల్స్ ఫలితాలలో జాతీయ స్థాయిలో 158వ ర్యాంకు సాధించిన విద్యుత్ శాఖ డిఇ అనిల్‌కుమార్ కుమారుడు సాయిచైతన్యను నెల్లూరు మాగుంట లే అవుట్‌లోని అతని స్వగృహంలో నేస్తం ఫౌండేషన్ సభ్యులు కలిసి అభినందించారు. ఈ సందర్భంగా నేస్తం ఫౌండేషన్ సభ్యులు కోరెం పెంచలబాబు మాట్లాడుతూ కృషి, పట్టుదల ఉంటే ఎంతటి లక్ష్యాలను అయినా జయించవచ్చని సాయిచైతన్య నిరూపించి ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు.

ఈ కార్యక్రమంలో నేస్తం ఫౌండేషన్ అధ్యక్షులు కోరెం ప్రవీణ్‌కుమార్, సభ్యులు వెంకటేశ్వరరావు, గాలి శివ, నవీన్, నాగేంద్ర పాల్గొన్నారు.

# బ్రాహ్మణులు అన్ని రంగాల్లో రాణించాలి



టివియస్ సత్రం 140వ సంస్థాపక దినోత్సవం సదస్సును ప్రారంభిస్తున్న ఐవైఆర్ కృష్ణారావు

రాష్ట్రంలో 4శాతం ఉన్న బ్రాహ్మణులు రాజకీయంగా, పారిశ్రామికంగా రాణించాల్సిన అవసరముందని ఏపి బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్ ఐవైఆర్ కృష్ణారావు పేర్కొన్నారు. ఆదివారం నెల్లూరు టౌన్‌హాల్లో జరిగిన శ్రీ తిప్పరాజు వెంకటసుబ్బయ్య సత్రం 140వ సంస్థాపక దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ రాజకీయాలు పాదయ్యాయంటూ దూరంగా ఉండటం సరైన విధానం కాదన్నారు. బ్రాహ్మణులతో పాటు పట్టణ ప్రాంతాల్లో అధికంగా వున్న వైశ్యులు, ముస్లింలను కలుపుకుని పనిచేస్తే రాజకీయంగా రాణించే అవకాశం ఉందన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత రాజకీయంగా అవకాశాలు లభించని వైశ్యులు, ముస్లింలు కలిస్తే రాష్ట్ర శాసనసభలో 40కిపైగా స్థానాలు ఈ సామాజికవర్గాలకు దక్కుతాయన్నారు. రాజకీయ బలం లేనంత కాలం అభివృద్ధి సాధ్యం కాదన్నారు. బ్రాహ్మణుల కోసం కార్పొరేషన్ ద్వారా ప్రత్యేక పథకాలను రూపొందించినట్లు తెలిపారు. బ్రాహ్మణుల సంక్షేమానికి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. 140ఏళ్లుగా బ్రాహ్మణులకు వారి పిల్లలకు ఆర్థికంగా చేయూతనిస్తున్న టివిఎస్ సత్రం ఇదే సేవాస్ఫూర్తితో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. టివియస్ సత్రం వ్యవస్థాపక ధర్మకర్త డా॥ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 108 పేద బ్రాహ్మణులకు వస్త్ర తాంబూలాలను అందజేశారు. తొలుత టివియస్ సత్రం 140వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య మహాసంస్థానాధీశులు శ్రీ విద్యారణ్య భారతి స్వామి జ్యోతిప్రకాశనం చేసి ప్రారంభించి, భక్తులకు అనుగ్రహభాషణం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఏపి బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ చంగవల్లి వెంకట్‌ప్రసాద్, ఏపి బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ జిల్లా సమన్వయకర్త ఉచ్చి భువనేశ్వరప్రసాద్, దేవాదాయశాఖ ఉప కమిషనర్ ఎం.వి.సురేష్‌బాబు, జిల్లా సహాయకమిషనర్ వేగూరు రవీంద్రరెడ్డి, చార్టెర్డ్ అకౌంటెంట్ ఎస్.వి.రావు, బ్రాహ్మణ ప్రముఖులు పాల్గొన్నారు.

## నెల్లూరు కబుర్లు

# జగన్ దీక్షలో నెల్లూరు నేతలు

కృష్ణానదిపై తెలంగాణ ప్రభుత్వం కడుతున్న అక్రమ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా కర్నూలులో ప్రతిపక్ష నేత జగన్ చేస్తున్న జలదీక్షలో నెల్లూరుజిల్లా వైకాపా నేతలు కూడా పాల్గొనడం జరిగింది. నెల్లూరు ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, కాకాణి గోవర్ధనరెడ్డి, మేకపాటి గౌతంరెడ్డి, కిలివేటి సంజీవయ్య, వైకాపా రాష్ట్ర ప్రధానకార్యదర్శి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, మాజీఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిలు సోమవారం జగన్‌తో పాటు జలదీక్షలో పాల్గొన్నారు.

అలాగే మంగళవారం తిరుపతి ఎంపి వరప్రసాదరావు, నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్, నెల్లూరు నగర పాలక సంస్థ వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఫ్లోర్ లీడర్ పి.రూప్‌కుమార్‌యాదవ్‌లు జగన్ దీక్షలో పాల్గొన్నారు.

కాగా, నెల్లూరుజిల్లాలో వైకాపా ఎమ్మెల్యేలు, ఆయా నియోజకవర్గాల ఇన్‌ఛార్జ్‌లు జగన్ జలదీక్షకు మద్దతుగా తమ ప్రాంతాలలో రిలే దీక్షలు నిర్వహిస్తున్నారు.

# మిర్చి ఘాటు.. టమోటా హాటు

ఇటీవల దాకా ఏ.సి కూరగాయల మార్కెట్‌లో పచ్చిమిర్చి ధర కిలో 20రూపాయలుగా వుండేది. గుట్టలు గుట్టలుగా పోసి అమ్ముతుండేవాళ్ళు. ఆ పచ్చిమిర్చి కిలో వందరూపాయలైంది. మామూలుగా దీనిని తింటే మంట పుట్టాలి. కాని ఇప్పుడు కొనాలంటేనే ధర దెబ్బకు మంటపుడుతుంది. ఇక మొన్నటిదాకా కిలో 10రూపాయలకే దొరికిన టమోటాలు ఇప్పుడు కిలో 50రూపాయలయ్యాయి. పెరిగిన కూరగాయల రేట్లతో వినియోగదారుల జేబులకు చిల్లులు పడుతున్నాయి.

# క్యాన్సర్ బాధితులకు ప్రాణం పోశారు



వివరాలను వెల్లడిస్తున్న డా॥ పవన్‌కుమార్

సింహపురి ఆసుపత్రిలో పేగు క్యాన్సర్ బాధితులకు అరుదైన చికిత్స చేసినట్లు ప్రముఖ జీర్ణకోశ వ్యాధుల నిపుణులు డా॥ వై.పవన్ కుమార్‌రెడ్డి తెలిపారు. 14వ తేదీ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నెల్లూరుకు చెందిన 80సంవత్సరాల మహిళ, 65సంవత్సరాల వ్యక్తి పెద్దపేగు క్యాన్సర్‌తో కొంతకాలం బాధపడుతూ తమ హాస్పిటల్‌కు వచ్చారని తెలిపారు. వారికి క్యాన్సర్ కారణంగా పేగులో ఏర్పడ్డ గడ్డ వల్ల అవరోధం ఏర్పడి పొట్ట ఉబ్బరంతో బాధపడుతున్నారని తెలిపారు. శరీరంలోని మలం క్రిందికి రాకుండా ఆగిపోయి కడుపునొప్పి, వాంతులతో ఇబ్బందులు పడుతున్నారని, ఇటువంటి కేసుల్లో సాధారణంగా ఆపరేషన్ చేసి అవరోధాన్ని తొలగిస్తామన్నారు. కాని, వచ్చిన మహిళ బి.పి, షుగర్, పక్షవాతంతో బాధపడుతున్నందున ఆపరేషన్ చేసే సమయంలోనే మరణించే అవకాశం ఉన్నందున, ఎండోస్కోపి ద్వారా పెద్దపేగులోని క్యాన్సర్ ఉన్న ప్రదేశంలో స్టంట్ అమర్చి అవరోధాన్ని తొలగించడం జరిగిందన్నారు. ఇలాంటి కేసు నెల్లూరులోనే కాక దక్షిణాంధ్రలోనే తొలిసారిగా సింహపురి హాస్పిటల్‌లో జరిగిందన్నారు. అత్యాధునిక వైద్యపరికరాలు అందుబాటులో ఉండటం వల్ల ఇది సాధ్యమైందన్నారు. ఈ చికిత్సకు సహకరించిన వైద్యనిపుణులు డా॥ పి.రాజమోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో సిఎఓ నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

# క్యాన్సర్ ఆసుపత్రికి విరాళం



విరాళం చెక్కును అందజేస్తున్న లేబూరు నారాయణరెడ్డి

నెల్లూరు పొదలకూరురోడ్డులోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటి క్యాన్సర్ హాస్పిటల్‌కు ప్రముఖ అనస్తటిస్ట్ డా॥ లేబూరు నారాయణరెడ్డి లక్ష రూపాయల విరాళాన్ని సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో నారాయణరెడ్డి కుమారుడు లేబూరు సుదీప్‌రెడ్డి, రెడ్‌క్రాస్ నెల్లూరుజిల్లా శాఖ ఛైర్మన్ డా॥ ఎ.వి.సుబ్రహ్మణ్యం, వైస్‌ఛైర్మన్ ఎల్.వి.నరసారెడ్డి, కోశాధికారి మోహన్‌లాల్‌జైన్, హాస్పిటల్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డా॥ టి.లక్ష్మి, రేడియేషన్ అంకాలజిస్ట్ డా॥ గీతా ఉషశ్రీ, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటి మేనేజింగ్ కమిటి సభ్యులు కె.భగవాన్, పోలయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఈ సందర్భంగా లేబూరు నారాయణరెడ్డి మాట్లాడుతూ రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రిలో పేదప్రజలకు అందుతున్న సేవల పట్ల తన సంతృప్తిని తెలియజేస్తూ ఈ విరాళాన్ని అందజేసినట్లు పేర్కొన్నారు.

# హోదాతోనే రాష్ట్రాభివృద్ధి - ఎమ్మెల్సీ సోమిరెడ్డి



రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ప్రత్యేకహోదా కావాల్సిందేనని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం వెంకటాచలంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ హోదా రాష్ట్ర ప్రజలకు సంబంధించిన అంశమని, కేంద్రం అన్ని రాష్ట్రాలకు ఇచ్చినట్లు ఆంధ్రప్రదేశ్‌కు నిధులు ఇస్తే సరిపోదన్నారు. టీడీపీ, బీజేపీ కలిసే ప్రత్యేకహోదా సాధనకు ఒత్తిడి చేయాల్సివుందన్నారు. రాష్ట్రాన్ని ఆదుకునేందుకు కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు ఉన్నారన్న నమ్మకం తమకుందన్నారు. దుగరాజపట్నం ఓడరేవు, కడపలో స్టీలు కర్మాగారం, విశాఖ రైల్వేజోన్, మూడేళ్ళలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి, బడ్జెట్‌లో ఇవ్వాల్సిన నిధులు తదితర అంశాలను పరిష్కరించాలన్నారు. ప్రధాన మంత్రి చొరవ తీసుకుని త్వరగా హోదా అంశం తేల్చాలన్నారు. జగన్ అభివృద్ధి నిరోధకుడని, హింసను ప్రేరేపిస్తున్నాడని, ఆయన ప్రవర్తన వల్ల రాష్ట్రానికి నష్టం అని ప్రజలు భావిస్తున్నారన్నారు. చంద్రబాబునాయుడు గురించి మాట్లాడే స్థాయి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి లేదన్నారు.

# అక్రమ ప్రాజెక్టులతో ఆంధ్ర ఎడారే!



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్యేలు అనిల్, కోటంరెడ్డి, కాకాణి, సంజీవయ్య

తెలంగాణ ప్రభుత్వం అక్రమంగా నిర్మిస్తున్న ప్రాజెక్టులతో ఆంధ్రప్రదేశ్ ఎడారిగా మారనుందని ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం నెల్లూరులోని వైఎస్సార్సీపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మన రాష్ట్రంలోని నీటిని తోడుకునిపోయేందుకు ఎగువన తెలంగాణ ప్రభుత్వం ప్రాజెక్టులు నిర్మించడం అన్యాయమన్నారు. ఈ ప్రాజెక్టులను నిర్మించకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు అడ్డుకోలేకపోవడం దారుణమని, వీటివల్ల రాష్ట్ర ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఈ అక్రమ ప్రాజెక్టుల నిర్మాణాలను నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్సీపి అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న ఆందోళనకు ప్రజలంతా మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. వైఎస్సార్సీపి జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ అక్రమ ప్రాజెక్టుల వల్ల భవిష్యత్తులో మన రాష్ట్ర ప్రజలకు సాగునీరు, తాగునీటికి ఎంతో ఇబ్బంది వుంటుందన్నారు. రాయలసీమ, ప్రకాశం జిల్లాలతో పాటు, మన జిల్లాకు కూడా చుక్కనీరు దొరకని స్థితి ఏర్పడుతుందన్నారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో సాగునీటి వనరుల పరిస్థితి అధ్వాన్నంగా తయారైందని, 1.75 లక్షల ఎకరాలకు రెండో పంటకు సాగునీరు అందిస్తామని బోర్డు సమావేశంలో అధికారులు చెప్పినప్పటికీ, ఆచరణలో ఇంకా రాలేదని, అధికారులు కాంట్రాక్టర్లకు వత్తాసు పలుకుతూ రైతాంగానికి అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ సమావేశంలో నెల్లూరు ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్, సూళ్ళూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ పి. రూప్‌కుమార్‌యాదవ్, వైఎస్సార్సీపి జిల్లా అధికార ప్రతినిధి విష్ణువర్ధన్‌రెడ్డి, సీనియర్ నాయకులు బాలచెన్నయ్య, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

• ఆనం...

# తొలి అడుగుతోనే సంచలనం

## ఇది ఆరంభం మాత్రమే!



సమావేశంలో మాట్లాడుతున్న ఆనం వివేకా, పక్కన ఎమ్మెల్సీ బీద రవిచంద్ర

నెల్లూరులోని జిల్లా తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో మాజీఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి ఈ నెల 16వ తేదీన తొలి సారి అడుగుపెట్టాడు. ఈ ఏడాది జనవరి లోనే ఆనం సోదరులు తెలుగుదేశంపార్టీలో చేరినప్పటికీ, ఇంతవరకు వాళ్లు పార్టీ కార్యాలయంకు రాలేదు. అక్కడ జరిగే పార్టీ కార్యక్రమాలలో పాల్గొన లేదు. తమ కార్యకలాపాలన్నింటిని కూడా ఏ.సి సెంటర్ లోని తమ కార్యాలయం నుండే నిర్వహిస్తూ వచ్చారు. 1983-1990ల మధ్య ఆనం సోదరులు తెలుగుదేశంలో వున్నప్పటికి అప్పుడు ఇప్పుడున్న పార్టీ కార్యాలయం లేదు. 2000-2001 ప్రాంతంలో ఇప్పుడున్న టీడీపీ కార్యాలయాన్ని కట్టారు. కాబట్టి ఈ ఆఫీసులో వివేకా అడుగుపెట్టడం ఇదే మొదటిసారని అనుకోవచ్చు.

ఇక ఆనంను వ్యతిరేకించే జిల్లా తెలుగుదేశం నాయకులెవరూ ఆరోజు ఆఫీసుకు రాలేదు. పార్టీ జిల్లా అధ్యక్షుడిగా బీద రవిచంద్ర, వారితో సన్నిహితంగా వుండే పార్టీ నగర ఇన్‌ఛార్జ్ ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డిలు మాత్రం హాజరయ్యారు. ఇక ఆఫీసులోకి రావడంతోనే టోల్‌గేట్‌పై జరుగుతున్న ఉద్యమంపై విమర్శలు చేశారు. పంపకాల కోసమే టోల్‌గేటుకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేస్తున్నారంటూ విమర్శలు గుప్పించారు.

పార్టీ ఆఫీసులో వివేకా సంచలనాలకు ఇది ఆరంభం మాత్రమే! ఇకముందు ఇక్కడ నుండి ఇంకెన్ని సంచలనాలు వెలువడ నున్నాయో చూడాలి.




పూండ్ల చెంచురెడ్డి గారు

సంస్మరణ

మా అభ్యున్నతికి కారకులు, మాకు స్ఫూర్తిప్రదాతలు
బంధుజనప్రియులు, సమతావాది

పూండ్ల చెంచురెడ్డి గారు

పరమపదించి తేది. 27.05.16 నాటికి
ఇరవై ఎనిమిది సంవత్సరాలు నిండుతాయి.
ఆ పుణ్యమూర్తిని సంస్మరించుకొంటూ...

భార్య :
పూండ్ల కామేశ్వరమ్మ

కుమారులు :
డా॥ పూండ్ల శ్రీనివాసులురెడ్డి
పూండ్ల వెంకురెడ్డి

మరియు
కుటుంబసభ్యులు

# అవసరమైన చోటే... ఇంకుడు గుంతలు



## - ప్రఖ్యాత శాస్త్రవేత్త డా.ఎ. జగదీష్ సూచన



అవసరమైన చోట ఇంకుడు గుంతలు తవ్వాలి తప్ప, ఎక్కడబడితే అక్కడ తవ్వి నందువల్ల పెద్దగా ప్రయోజనమేమీ వుండదని ప్రఖ్యాత ప్రత్యామ్నాయ ఇంధన వనరుల శాస్త్రవేత్త, నెల్లూరులో నాయుడమ్మ సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆల్టర్నేటివ్స్ సంస్థ డైరెక్టర్ డా. ఎ.జగదీష్ సూచిస్తున్నారు. భూమిలో నీటి మట్టం అన్ని ప్రదేశాల్లో సమానంగా వుండదని, సాధారణంగా బోర్లు వేసేటప్పుడు ఆ విషయం మనకు తెలుస్తుందని అంటూ, భూమిలో జల పైకి వుంటే ఈ ఇంకుడు గుంతల నుంచి ఇంకే నీరు ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. జిఐఎస్ (జియోగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్) డేటా రిమోట్ సెన్సింగ్ ద్వారా భూమిలోని నీటి వివరాలు మనకు లభ్యమవుతాయని, ఎక్కడ నీరు తక్కువ లోతులో దొరుకుతుందో అక్కడ కనీసం ఆరు అడుగుల లోతు ఇంకుడు గుంతలు తవ్వడం వల్ల ప్రయోజనం వుంటుందని ఆయన స్పష్టం చేశారు. ఇప్పుడు ఎంతో శాస్త్ర విజ్ఞానం మనకు అందుబాటులో వుందని, శాస్త్రీయంగా భూమిలోని నీటి వివరాలు తెలుసుకుని అవసరమైన చోటులోనే ఇంకుడు గుంతాలు తవ్వాలి తప్ప, ఏదో టార్గెట్ సాధించాలనే తపనతో ఎక్కడబడితే అక్కడ ఇంకుడు గుంతలు తవ్వడం సమంజసం కాదని ఆయన సూచించారు.

### సాంకేతిక పరిజ్ఞానం ఎంతైనా అవసరం :

ప్రస్తుతం రాష్ట్రంలో ఇంకుడుగుంతలు తవ్వడంపై, వర్షపునీటిని ఆదా చేయడంపై జోరుగా ప్రచారం జరుగుతోంది. గతంలోనూ చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా వున్న కాలంలోనూ ఇంకుడుగుంతలు పెద్ద సంఖ్యలో నెలకొల్పారు. ఇప్పుడు ప్రతి ఇంటిలోనూ ఇంకుడుగుంత తప్పనిసరిగా వుండాలంటున్నారు. అది ఎంతవరకు సాధ్యం?..అందువల్ల ఆశించిన ఫలితాలుంటాయా?..అని ఆయన ఈ సందర్భంగా ప్రశ్నించారు. అన్ని ప్రదేశాల్లో నెలకొల్పే ఇంకుడుగుంతలు నీరు ఇంకిపోయేందుకు అనువుగా వుండవని, నేలను బట్టి ఇంకుడుగుంతల ప్రయోజనం ఆధారపడివుంటుందని ఆయన సూచించారు. కొన్ని నేలల్లో అసలు నీరే ఇంకదని, అందువల్ల సాంకేతిక పరిజ్ఞానంతో ఎక్కడ అవి అవసరమో తెలుసుకుని వాటిని అక్కడ నిర్మించడమే శ్రేయస్కరమని ఆయన అన్నారు. ప్రస్తుతం అనుసరిస్తున్న ఇంకుడుగుంతల నిర్మాణ పద్ధతిలోనూ లోపాలున్నాయని, నాలుగు పక్కల నుంచి నీరు ఇంకినందువల్ల నీరంతా వృధా అవుతుందని ఆయన పేర్కొన్నారు. పైగా ఈ ఇంకుడుగుంతలు బయట నెలకొల్పడం వల్ల మనుషులు, జంతువులు పొరపాటున ఆ గుంతల్లో పడే ప్రమాదం కూడా వుందని ఆయన పేర్కొన్నారు. ఇటీవల శ్రీకాకుళం జిల్లాలోని జగన్నాధపురంలో ఇంటింటి ముందు ఇంకుడుగుంతలను నెలకొల్పారని, కేవలం ఒకే ఒక్కరోజులో 40 వేల ఇంకుడుగుంతలు ఏర్పాటుచేసి రికార్డు సృష్టించారని ఆయన ప్రస్తావిస్తూ, అయితే, ఈ ఇంకుడు గుంతల లోతు ఎంత?..అవి ఇంటిముందు తవ్వడం వల్ల ఆడుకునే పిల్లలు వాటిలో పడే ప్రమాదం లేదా?..ఎదురెదురు ఇళ్ళ ముందు వీటిని తవ్వడం వల్ల పాదచారులకు, ట్రాఫిక్‌కు అంతరాయం కలగదా?.. ఈ గుంతల్లో నీరు నిల్వ వుంటే దోమల ఉత్పత్తి జరగదా?. డ్రైనేజీ, టెలిఫోన్ కేబుల్స్‌కు అంతరాయం కాదా?..అయినా మూడు అడుగుల ఇంకుడుగుంతల వల్ల 50 అడుగుల లోతు జలకు ఈ ఇంకుడుగుంతల జల చేరుతుందా?..అని ఆయన ప్రశ్నించారు. ఈ లోపాలను అధిగమించేందుకు ఒక వినూత్నమైన ఇంకుడుగుంతలను తాము సూచిస్తున్నామని, ఈ గుంతలు ఎక్కువకాలం వుండేవిధంగా తాము స్వయంగా 'జగా భగీరథ గుంట'ను రూపొందించామని ఆయన ఆ వివరాలు తెలియజేశారు.

### వినూత్నమైన ఇంకుడుగుంతల ఏర్పాటు ఎలా?..

ముందుగా 6 అడుగుల పొడవు, 3 అడుగుల వెడల్పు, ఆరు అడుగుల లోతు గుంటను తవ్వాలి. ఆ గుంతలో నలుమూలలా హెచ్‌డిపి (హైడెన్సిటీ పాలిథిన్) షీట్‌ను లుంగీలాగా కుట్టి కప్పాలి. ఈ హెచ్‌డిపి అల్ట్రావైలెట్ ట్రీట్ చేయడం వల్ల గుంతలు ఎక్కువకాలం వుంటాయి. గుంతలో కంకరరాళ్ళు, ఇసుక (పరిమాణాన్ని బట్టి) పోయాలి. పైన వెదురు తడికలను వుంచాలి. ఆ వెదురు తడికలు ప్రమాదాలు జరగకుండా కాపాడుతాయి. వెదురు తడికల బొంగుల మధ్యలో ఖాళీ వుండడం వల్ల వర్షపు నీరు ఆగకుండా ఆ గుంతల్లోకి వెళ్తుంది. ఎక్కువ వర్షం వచ్చినప్పుడు ఆ వెదురు తడికలను పక్కన పెట్టవచ్చు. వెదురు తడికలు, హెచ్‌డిపి బజార్లలో మనకు దొరుకుతాయి. ఈ గుంతల నిర్మాణవ్యయం కూడా బాగా తక్కువే. గుంతలు తవ్వేందుకు ఇచ్చే కూలి మినహాయిస్తే, కేవలం రూ. 15 వందల లోపే ఖర్చవుతుంది. ఈ ఇంకుడుగుంతలతో పాటు పొలాల్లో 'ఫార్మ్ పాండ్స్' నెలకొల్పడం వల్ల ఎంతో నీటిని ఆదా చేయవచ్చు. కనుక, వినూత్నమైన, సమర్థవంతమైన ఇలాంటి ఇంకుడుగుంతల ఏర్పాటును అటు ప్రభుత్వం, ఇటు ముఖ్యమంత్రి పరిశీలించి, వీటిని నిర్మించుకుంటే మరింత ప్రయోజనకరంగా వుంటుందని ఆయన సూచించారు. ఇజ్రాయిల్‌లో 3వేల అడుగుల లోతు నుంచి నీటిని తోడి పెద్ద పెద్ద రిజర్వాయర్లలో నిల్వ వుంచి వినియోగించుకుంటున్నారు. మనం కూడ అలాంటి పెద్ద రిజర్వాయర్‌ల ఏర్పాటుకు సమాయత్తం కావాల్సి వుందని ఆయన సూచించారు. అదేవిధంగా అపార్ట్‌మెంట్లలో నెలకొల్పే బోర్‌వెల్స్ చుట్టూ నీటి రీఛార్జ్ కోసం చిన్న బావిని తవ్వి, గులక, ఇసుక పోయడం వల్ల వర్షపు నీటిని ఎంతో ఆదా చేయవచ్చని ఆయన పేర్కొన్నారు. చిన్న, మధ్య తరహా రైతుల పొలాల్లో నీటిని కాలువల ద్వారా సరఫరా చేస్తుంటారని, వీటివల్ల ఆవిరి రూపంలో, నీరు ఇంకుడు రూపంలో ఎంతో నీరు వృధా అవుతుందని ఆయన పేర్కొంటూ, అలాంటిచోట్ల రైతులు పివిసి పైపులను అమర్చుకునేందుకు ప్రభుత్వం ఒక పథకాన్ని రూపొందిస్తే ఎంతో నీటిని ఆదా చేయవచ్చని ఆయన సూచించారు.

# గూడూరు డివిజన్ వార్తలు

## మహనీయులను తయారు చేసేది తల్లే!

### - బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు



సృష్టిలో మహనీయులను తయారు చేసేది ఒక్క తల్లి మాత్రమేనని ప్రభుత్వ ముఖ్య సలహాదారు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు తెలిపారు. గూడూరు పట్టణంలోని సిఆర్ రెడ్డి కళ్యాణ మండపంలో కనుమూరి హరిచంద్రారెడ్డి ఛారిటబుల్ ట్రస్టు అధినేత హరిచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి 'కుటుంబ వైభవం' అనే అంశంపై ఆయన ప్రవచనం చేశాడు. వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ శాస్త్రోక్తంగా చాగంటికి స్వాగతం పలికి వేదాశీర్వాదాలు అందించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కుటుంబ వ్యవస్థలో తల్లీదండ్రి, అన్నా చెల్లెలు, అక్కా తదితర పాత్రల ప్రాముఖ్యత, విశిష్టతను వివరించారు. సృష్టిలో అమ్మ సృష్టికర్త, స్థితి కర్తని, బిడ్డ అన్ని విధాల ఆదర్శవంతంగా ఉన్నత స్థాయికి ఎదిగేందుకు చివరిక్షణం వరకు తండ్రి పోరాడుతాడని చెప్పారు. కుటుంబంలో మాతృమూర్తి జీవులకు పుణ్యం, బలం, ప్రాణం పోస్తుందన్నారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థలో సుఖసంతోషాలు, మానసిక ప్రశాంతత ఉండేదని, ప్రస్తుతం అవి లేకపోవడంతో వ్యాధులు, విలువ గౌరవం ప్రతిష్ట లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, ట్రస్టు అధినేత హరిచంద్రారెడ్డి, ప్రతినిధులు మునిగిరీష్, చంద్రశేఖరయ్య తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం



నూతన అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డిని అభినందిస్తున్న కమిటి సభ్యులు

గూడూరు పట్టణంలోని లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. ఈ కార్యక్రమాన్ని పట్టణ విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఇటీవల నిర్వహించారు. అధ్యక్షుడుగా నెలబల్లి భాస్కర్‌రెడ్డి, కార్యదర్శిగా చంద్రశేఖర్, కోశాధికారిగా కడివేటి చంద్రశేఖర్‌లను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నూతన కమిటి అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ నూతన కమిటి ఆధ్వర్యంలో ప్రజలకు మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కమిటి అధ్యక్షుడు తోట సురేష్, కమిటి సభ్యులు షేక్ రియాజ్ అహ్మద్, మస్తాన్, శ్రీనివాసులు, మురళీకృష్ణ, రాజారెడ్డి, రాజమోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధితోనే పార్టీ పటిష్టం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, పక్కన మున్సిపల్ ఛైర్మెన్ దేవసేన తదితరులు

అభివృద్ధి పనులతోనే పార్టీని బలోపేతం చేయాలని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అన్నారు. పట్టణంలోని రోడ్లు భవనాల అతిథిగృహంలో ఆదివారం తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వార్డుల్లో సమస్యలు పరిష్కరిస్తేనే ప్రజల్లో పార్టీపై నమ్మకం పెరుగుతుందన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు తనవంతు సహాయ సహకారాలను అందిస్తానన్నారు. వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని కౌన్సిలర్లను కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, తెలుగుదేశంపార్టీ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసులు, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పదిలో వివేకానంద విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

గూడూరు శ్రీ వివేకానంద హైస్కూల్‌లో పదవ తరగతి ఫలితాల్లో వై.వనీనా 10కి 10 పాయింట్లు, జి.సాయికుమార్ 9.8 పాయింట్లు, ఎన్.లోకేష్ 9.8 పాయింట్లు సాధించారని ఆ స్కూల్ కరస్పాండెంట్ చంద్రమోహన్ తెలిపారు. తమ పాఠశాల నూరు శాతం ఉత్తీర్ణత సాధించిందన్నారు.

## జి.వి.ఎస్ హవా



ఎస్.కె.నౌరిన్

పదో తరగతి ఫలితాల్లో పట్టణంలోని శ్రీ జివిఎస్ శంకరయ్య పాఠశాల విద్యార్థులు సుహైల్, శ్రీగౌరి, వీనస్ విక్రాంత్, రాజ్‌కుమార్ పదికి పది పాయింట్లు సాధించారని ఆ పాఠశాల కరస్పాండెంట్ విజయసుమన తెలిపారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఫలితాల్లో తమ పాఠశాల నూరు శాతం ఉత్తీర్ణత సాధించిందన్నారు. 80 మంది విద్యార్థులు 9 పాయింట్లకు పైగా సాధించారన్నారు. ఈ విజయానికి ఉపాధ్యాయులు, విద్యార్థుల కృషి కారణమన్నారు. విద్యార్థులను ఈ సందర్భంగా అభినందించారు.

# బాబు గొప్పలతో ఏపికి తిప్పలు

గల్పిక

ఢిల్లీలోని ప్రధాని కార్యాలయం... ఏపికి ప్రత్యేకహోదా కోరదామని వైకాపా అధ్యక్షుడు వై.యస్.జగన్మోహన్‌రెడ్డి, పిసిసి అధ్యక్షులు రఘువీరారెడ్డి, సీపీఎం రాఘవులు, సిపిఐ నారాయణలు ఇతర నాయకులతో కలిసి పిఎం నివాసానికి వెళ్లారు. "పెదవే పలికిన తియ్యని మాటే అమ్మ" అనే పాట వీరికి వినిపించసాగింది. అయితే అది సినిమాలో పాటలాగా కాకుండా అక్కడే ఎవరో పాడుతున్నట్లుగా ఉంది. ఇంతమంచి పాట ఇంత పొద్దున్నే పాడుతున్నదెవరబ్బా అని అందరూ అక్కడున్న గార్డెన్‌వైపు చూశారు. అంతే అక్కడ దృశ్యాన్ని చూసి వీళ్లు ఎంతో ఉద్వేగానందానికి లోనయ్యారు. ప్రధాని నరేంద్ర మోడీ తన తల్లి హీరాబెన్‌ను మూడు చక్రాల కుర్చీలో కూర్చోబెట్టి ఆ పాటపాడుతూ అక్కడ ఉద్యానవనమంతా చూపిస్తున్నాడు. అలా అమ్మ గురించి ఓ నాలుగు పాటలు పాడిన తర్వాత ఏపి నాయకులను గమనించి వారి వద్దకు వచ్చాడు. ఏపి నాయకులు కూడా మోడీ తల్లి పాదాలకు నమస్కరించారు. తర్వాత నారాయణ వుండి... సార్, అమ్మ పాటలు బాగా పాడారు, ఎప్పుడు నేర్చుకున్నార్సార్ అని అడిగాడు. గుజరాత్ నుండి మా అమ్మ వస్తుందని తెలిసి, ముందుగానే హైదరాబాద్ నుండి పాడుతాతీయగా గాయకులను పిలిపించుకుని నేర్చుకున్నానని చెప్పాడు. మీకు అమ్మే కాదు, అమ్మ పాటలన్నా కూడా చాలా ప్రేమే ఉందని బి.వి.రాఘవులు కితాబిచ్చాడు. తర్వాత మోడీ తన తల్లితో దిగిన సెల్ఫీలను అప్పటికప్పుడు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో పెట్టేసి, తన తల్లిని గుజరాత్‌కు సాగనంపాడు. తర్వాత ఏపి నాయకులను తన ఛాంబర్‌లోకి తోడ్కొనిపోయాడు. తన చేత్తో అప్పటికప్పుడు టీ కాసి అందరికీ ఇచ్చి... ఇప్పుడు చెప్పండి, ఏం పని మీద వచ్చారని అడిగాడు. అప్పుడు రఘువీరారెడ్డి... విభజన తర్వాత మా రాష్ట్ర పరిస్థితి ఏమీ బాగాలేదు, దీనిని చెప్పడం కంటే మీరు చూస్తేనే బాగుంటుందంటూ ఒక సిడిని కంప్యూటర్‌లో పెట్టి ఆన్ చేశాడు. స్క్రీన్ మీద...

13జిల్లాల ఆంధ్రప్రదేశ్... ప్రతి జిల్లాలోనూ కరువు... తాగడానికి నీళ్లు లేవు... ప్రజలు మైళ్ల దూరం నడిచివెళ్లి నీళ్లు తెచ్చుకుంటున్నారు. ఉపాధి అవకాశాలు లేక ప్రజలు ఇతర రాష్ట్రాలకు వలసపోతున్నారు. ఇక ప్రభుత్వమైతే ఆర్థిక కష్టాల మూలంగా కఠినచర్యలు తీసుకుంది. సీఎం చంద్రబాబు రెండు పూటలు తింటూ ఒక పూట పస్తుంటున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా తలా ఒక పూట భోజనం తగ్గించారు. టీలు, కాఫీలు కూడా వన్‌బైటూ చెప్పుకుని తాగుతున్నారు. మంత్రుల కార్యాలయాలలో కరెంట్ ఖర్చని ఏసిలు కూడా వాడడం లేదు. అమరావతి రాజధానికి శంకుస్థాపన చేసారనేగాని, అక్కడకొట్టిన టెంకాయ చిప్పలు కూడా అక్కడే పడి వున్నాయి. చంద్రబాబు, ఆయన మంత్రులు నాన్‌ఏసి అంబాసిడర్ కార్లలో పర్యటనలు చేస్తున్నారు. చంద్రబాబు ఎప్పుడన్నా విదేశీ పర్యటనలకు పోవాల్సి వస్తే పార్టీ నాయకులంతా చందాలేసుకుని ఎకనమీ క్లాసులో పంపిస్తున్నారు. ఎమ్మెల్యేలెవరికీ జీతాలు లేవు. సీఎంగా చంద్రబాబు కూడా రైళ్లలో ఛార్జీలు తక్కువని, అన్ని ప్రాంతాలకు రైళ్లలోనే వెళుతున్నాడు. హెలికాప్టర్ ముఖమే చూడడం లేదు. అమరావతి రాజధాని డిజైన్‌ను కూడా సింగపూర్, జపాన్ వాళ్ల చేత గీయిస్తే ఖర్చు ఎక్కువవుతుందని, నెల్లూరులోని భారత్ బిల్డర్స్ కంపెనీకి అప్పగించాడు. వాళ్లు సచివాలయం, అసెంబ్లీహాల్‌లకు రేకుల షెడ్లతో కూడిన డిజైన్ గీసిచ్చారు. ఈ చిత్రాలన్నీ కూడా కంప్యూటర్ స్క్రీన్ మీద వస్తుండగా, బ్యాక్‌డ్రాప్‌లో వాటిని వర్ణిస్తూ ఒక లేడీ వాయిస్ పెట్టారు. ఈ దృశ్యాలు చూసాక మోడీ మనసు కరిగిపోతుందని, ఖచ్చితంగా ఏపికి ప్రత్యేకహోదా ప్రకటిస్తారని ఏపి నాయకులంతా ఆశగా ఆతృతగా ఎదురుచూడసాగారు. అంతా చూసాక మోడీ... టేబుల్ డ్రాయర్ తీసి ఒక సి.డి చేతిలోకి తీసుకుని... మీరొక సి.డి చూపించారు, నా దగ్గరా ఒక సి.డి వుంది, చూడండి... అంటూ ఆన్ చేశాడు. స్క్రీన్ మీద సీన్‌లు మొదలయ్యాయి.

చంద్రబాబు ఇంటి నుండి కాన్వాయ్‌లో బయలుదేరాడు. బేగంపేట ఎయిర్‌పోర్టులో స్పెషల్ ఫ్లైట్ ఎక్కాడు. రేణిగుంట ఎయిర్‌పోర్టులో దిగాడు. అక్కడ నుండి హెలికాప్టర్‌లో చిత్తూరుకు, ఆ తర్వాత పూతలపట్టుకు పోయాడు. ఈలోపు రేణిగుంటలో వున్న స్పెషల్ ఫ్లైట్ బెంగుళూరు ఎయిర్‌పోర్టుకు పోయింది. చంద్రబాబు పూతలపట్టులో పర్యటన ముగించి హెలికాప్టర్‌లోనే బెంగుళూరు ఎయిర్‌పోర్టుకు పోయాడు. అక్కడ విమానమెక్కి మళ్లీ హైదరాబాద్ చేరాడు. గోదావరి పుష్కరాలకు 2వేల కోట్లు... పట్టిసీమకు 1200కోట్లు... ప్రతి జిల్లాకు మజ్జిగ ప్యాకెట్లకు మూడేసి కోట్లు... ప్రతి పండక్కి చంద్రన్న కానుకలు... వైకాపా ఎమ్మెల్యేలకు ఒక్కొక్కరికి 10 నుండి 30కోట్ల బేరం... ప్రతి ఎమ్మెల్యేకు ఆడి, బెంజి కార్లు... పెరిగిన జీతాలు... ఇక ప్రపంచంలో 50దేశాల ఇంజనీర్లు అమరావతి రాజధాని డిజైన్‌లు గీసుకుని వచ్చారు. వాటిని చూస్తున్న చంద్రబాబుకు ఏదీ నచ్చడం లేదు... ఆయన ఇంజనీర్లతో... అమరావతి రాజధాని ప్రపంచంలోనే రిచ్చెస్ట్ రాజధానిగా ఉండాలి, ఎంత డబ్బయినా ఫరవాలేదు, అలాంటి డిజైన్ గీసిస్తే మీకు వందలకోట్లు కమిషన్ ఇస్తాను, బుల్లెట్ ట్రైన్స్, ఎయిర్‌పోర్టులు, ఉద్యానవనాలు... నైన్‌స్టార్ హోటల్స్... అన్నీ రాజధానిలో ఉండాలి. ఏపిని అభివృద్ధిలో ఈ దేశంలోనే కాదు, ఈ ప్రపంచంలోనే నెంబర్ వన్‌ను చేస్తా... డబ్బుకు లోటే లేదు... అని చెబుతున్నాడు. ఇక మంత్రులు కూడా సూటూ, బూట్లు వేసుకుని రాజధాని అధ్యయనం పేరుతో స్పెషల్ ఫ్లైట్లు వేసుకుని తమకు నచ్చిన దేశాలకు పోతున్నారు.

మోడీ ఇక్కడితో సి.డిని ఆఫ్ చేసి మొత్తం సిడిని చూడాలంటే ఇంకా గంట టైం పడుతుంది. నాకు వేరే అపాయింట్‌మెంట్స్ ఉన్నాయి. ఇప్పటిదాకా చూసిన సీన్‌లకే మీకు అర్ధమై ఉంటుంది... ఏపి పేద రాష్ట్రం కాదని, ప్రత్యేక హోదా ఏదీ అక్కరలేదని... చంద్రబాబు ప్లాన్ చేసిన రాజధాని దేశానికే కాదు... ప్రపంచానికే రోల్‌మోడల్. మరి ఇలాంటి ధనిక రాష్ట్రానికి ప్రత్యేకహోదా అవసరమా? అని మోడీ ప్రశ్నించాడు. దీంతో అంతా అవాక్కయ్యారు. నారాయణ మనసులో ఇతనికి చంద్రబాబు పైనవేసుకున్న కోటు మాత్రమే కనిపిస్తుంది, లోపల వేసుకున్న చిరుగుల డ్రాయర్, బనియన్ కనిపిస్తే కదా అనుకున్నాడు. మిగతా వాళ్లు కూడా మనసులో... చంద్రబాబు గొప్పలు ఏపికి తిప్పలు తెచ్చాయనుకుంటూ తిరుగుముఖం పట్టారు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ఆర్థిక పరిస్థితి స్వల్పంగా ఇబ్బందికరంగా ఉంటుంది. వృత్తి వ్యాపారాలలో సామాన్య ఆదాయముంటుంది. బంధువర్గం వారి వ్యాఖ్యానాల వల్ల విభేదాలు రావచ్చును. అనుకున్న పనులు ఆలస్యం కాగలవు. ఆరోగ్యం కూడా సరిగా ఉండదు. ఆర్థిక లావాదేవీల, స్థిరాస్తుల క్రయ విక్రయాలు వాయిదా పడటం మంచిది. హామీలు, అప్పులు ఇవ్వవద్దు. మనోధైర్యం బాగుంటుంది.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

రావలసిన బాకీలు వసూలు కావడం, ప్రభుత్వ అనుమతులు పొందడం, కోర్టు వ్యవహారాలలో అనుకూలత ఉంటుంది. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. పరీక్షలందు విద్యార్థులకు సంతృప్తి ఉంటుంది. ఆరోగ్యం బాగుంటుంది. అనుకున్న పనులు సవ్యంగా జరుగుతాయి. ఆకర్షణీయ పథకాలలో వ్యాపారాలు ఊపు అందుకొనగలవు. కొత్త పదవులు బాధ్యతలు స్వీకరిస్తారు.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ఇతరుల విషయాలలో శ్రద్ధ చూపకండి. ఉద్యోగుల సమర్ధతకు గుర్తింపు ఉంటుంది. యజమానులకు నిర్మాణాలు చేసేవారికి వర్కర్లతో ఇబ్బందులుంటాయి. పర్యటనలు అదనపు బాధ్యతలుంటాయి. బంధువర్గంతో సామరస్యంగా పరిష్కారాలు జరుపుకొంటారు. ఈ వారం ఖర్చులు అదనంగా ఉంటాయి. కొత్త పరిచయాలు కలుగుతాయి. అనుకున్న పనులు నిదానంగా జరుగుతాయి.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

బిడ్డల విద్యా వివాహములందు శ్రద్ధ చూపుతారు. ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు లభించగలవు. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. రావలసిన బాకీలు కొంతమేరకు అందుతాయి. ఆరోగ్యం బాగుంటుంది. కొత్త ఆర్థిక ప్రయత్నాలకై కృషి చేస్తారు. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా జరుగుతాయి. అనుకున్న పనులు నిదానంగా సాగుతాయి.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

ఆర్థికాభివృద్ధి అవకాశాలు మందగిస్తాయి. విద్యార్థులకు పరీక్షలందు సామర్థ్యం బాగుంటుంది. భాగస్వామిక ఒప్పందాలు జరుగుతాయి. సొంత పనులు జరగడానికి బాగా శ్రమపడాలి. విదేశ ప్రయాణాలు నిర్ణయం కాగలవు. ఆరోగ్యం, కుటుంబసౌఖ్యం బాగుంటుంది. ఆదాయ వ్యయాలు సామాన్యంగా ఉంటాయి. పరిచయాలు, బాంధవ్యాలు బలపడతాయి.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

బిల్డర్లకు, యజమానులకు కార్మికులతో సమస్యలు ఏర్పడవచ్చును. ఉన్నత విద్యావకాశాలు కలవు. ఆరోగ్యం సంతృప్తికరం. భాగస్వామిక చర్యలు ఫలిస్తాయి. శుభ కార్య ప్రయత్నాలు ఆలస్యం కాగలవు. కొత్త కాంట్రాక్టులు లీజులకు అవకాశాలు లభిస్తాయి. అనుకున్న పనులు ఆటంకాలతో సాగుతాయి. ఆర్థిక ఇబ్బందులుంటాయి. వాటిని అధిగమించే కృషి చేస్తారు.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 20.05.2016 నుండి
తేది. 26.05.2016 వరకు

ఈ వారం మేషంలో బుధుడు, వృషభంలో రవిశుక్రులు, సింహంలో గురురాహువులు, వృశ్చికంలో శనికుజులు, కుంభంలో కేతువు, తులా వృశ్చిక ధనుర్మకర రాశులలో చంద్రుడు సంచరిస్తారు.

**పంచాంగము:**
తేది 20 శుక్రవారము నృసింహ జయంతి. తేది 21 శనివారము శ్రీకూర్మ జయంతి, శ్రీ అన్నమాచార్య జయంతి.

శుక్రమౌఢ్యమి జరుగుచున్నది.
ముహూర్తములు లేవు.
కర్తరి జరుగుచున్నది.

**వైశాఖ మాస శుక్లపక్ష తిధులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 20 | శుక్ర | చతుర్దశి | రా॥ గం.11.46వ॥ |
| తేది. 21 | శని | పూర్ణిమ | రా॥ గం.1.40వ॥ |

**వైశాఖ మాస కృష్ణపక్ష తిధులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 22 | ఆది | పాడ్యమి | రా॥ గం.3.14వ॥ |
| తేది. 23 | సోమ | విదియ | రా॥ గం.4.23వ॥ |
| తేది. 24 | మంగళ | తదియ | రా॥ గం.5.07వ॥ |
| తేది. 25 | బుధ | చతుర్థి | రా॥ గం.5.17వ॥ |
| తేది. 26 | గురు | పంచమి | రా॥ గం.4.53వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

బిడ్డలకు విద్యావృద్ధి, శుభకార్యాలు నిర్ణయం కావడం ఉంటుంది. ముఖ్య విషయాలందు మంచి వ్యక్తుల సలహా పొందడం జరగాలి. ఉద్యోగులకు అదనపు బాధ్యతలుంటాయి. వ్యవహారాలలో ఇతరులు సమస్యలను సృష్టిస్తారు. ఉత్తమ వ్యక్తులతో పరిచయాలు కలుగుతాయి. ప్రభుత్వ సంబంధిత పనులు, అనుమతులు ఆలస్యం కాగలవు. కోర్టు కేసులందు ఆలస్యం అవుతుంది.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

అనుకోని ప్రయాణాలుంటాయి. తొందరపాటు మాటలు, ప్రవర్తనల వల్ల ఇబ్బందులు పడతారు. చేపట్టిన పనులను విజయవంతంగా నెరవేర్చుతారు. ఆరోగ్య లోపం కొద్దిగా ఇబ్బంది పెడుతుంది. ఆర్థిక పరిపుష్టి ఉంటుంది. వ్యాపారవర్గాలకు అభివృద్ధి అవకాశాలుండి ఆదాయం పెరుగుతుంది. వృత్తి జీవనం కలవారికి సామాన్య స్థితి ఉంటుంది.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

ఆర్థిక ఇబ్బందులు లేకపోయినా వృత్తి వ్యాపారాలలో అసంతృప్తిగా ఉంటుంది. రావలసిన బాకీలు నిలబడిపోయినా చెల్లింపులు సకాలంలో జరుపుతారు. ఉద్యోగులకు అధికారులతో సామాన్యంగానే ఉంటుంది. స్థిరాస్తుల లావాదేవీలు, కొత్త పెట్టుబడులను వాయిదా వేసుకోవడం మంచిది. అనుకున్న పనులు వాయిదా పడగలవు. శుభకార్యాల నిర్ణయాలు జరగవచ్చును.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఉద్యోగ వర్గాలకు బాధ్యతలలో మార్పులుంటాయి. నూతన వస్తు సామాగ్రిని సమకూర్చుకొంటారు. ఆత్మీయులకు సహాయం చేస్తారు. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. స్వల్పంగా అనారోగ్య బాధలుంటాయి. ఆస్తుల లావాదేవీలు, బినామి వ్యవహారాలు ప్రస్తుతం వద్దు. వృత్తి జీవనము, ఉద్యోగ జీవనము కలవారికి అదనపు ఆదాయం ఉంటుంది.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

వృత్తి వ్యాపారాలలో మంచి అవకాశాలుండి ఆదాయం పెరుగుతుంది. ఇతరుల విషయాలను పట్టించుకోవద్దు. ఉద్యోగులకు అధికారులకు అదనపు బాధ్యతలు, పనిభారం, ప్రయాణాలుంటాయి. కోర్టు వ్యవహారాలలో అనుకూలత, ప్రభుత్వ అనుమతులు పొందడం జరుగుతుంది. ఆరోగ్యం బాగుంటుంది. సమయానుకూలంగా నిర్ణయాలు తీసుకొని పనులు జరుపుకొంటారు.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

గృహ వస్తు వాహన రిపేర్లుంటాయి. కొత్త వ్యాపారాలకు, పెట్టుబడులకు ప్రయత్నాలు చేస్తారు. ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు తీసుకొనవలసి ఉంటుంది. ప్రముఖులతో అధికారులతో సత్సంబంధాలుంటాయి. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలమైన అవకాశాలు లభించగలవు. ఇతరుల వ్యవహారాలలో తల దూర్చడం గాని, ఋణాలివ్వడం గానీ చేయకూడదు.

# కావలి కబుర్లు

## పార్టీలకతీతంగా
# పట్టణాన్ని అభివృద్ధి చేస్తా



కొత్తగా బాధ్యతలు చేపట్టిన చైర్‌పర్సన్ అలేఖ్య

పార్టీలకతీతంగా కావలి పట్టణాన్ని అభివృద్ధి చేస్తానని మున్సిపల్ చైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య అన్నారు. 13వ తేదీ కొత్తగా చైర్మన్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంత్రి నారాయణ, బీదా సోదరుల ఆదేశాల మేరకు బాధ్యతలు చేపట్టానని అన్నారు. పట్టణంలో త్రాగునీరు, విద్యుత్, మౌళిక వసతులకు పెద్దపీట వేస్తానన్నారు. పాఠశాలలో అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ప్రభుత్వం చేపట్టిన ఇంకుడు గుంటల కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎయంసి చైర్మన్ గ్రంధి యానాధి శెట్టి, టిడిపి పట్టణ ప్రధాన కార్యదర్శి అమరా వేదగిరి, డిఈ శ్రీనివాసులు సిబ్బంది పాల్గొన్నారు.



ఈ నెల 16వ తేదీన కావలిలో శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి జన్మదినోత్సవం సందర్భంగా అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న కావలి పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు.

# భూగర్భ జలాలు పెంచేందుకు కృషి చేయాలి

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భూగర్భజలాలు పెంచేందుకు బృహత్తర పథకం అయిన ఇంకుడు గుంటల కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములై ప్రతిఇంట్లో ఇంకుడు గుంట ఉండే విధంగా కృషి చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి పత్తిపాటి పుల్లారావు అన్నారు. ఈ నెల 14వ తేదీన రాజధాని నిర్మాణ కమిటీ సభ్యులు బీదా మస్తాన్‌రావు ఆధ్వర్యంలో మద్దూరుపాడులోని వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డ్‌లో మంత్రి పత్తిపాటి పుల్లారావుచే ఇంకుడు గుంటకు శంకుస్థాపన చేయించారు. ఈ సందర్భంగా మంత్రి పత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ కావలి నియోజకవర్గంలో మొట్టమొదటి ఇంకుడుగుంట కార్యక్రమానికి శ్రీకారం చుట్టానని ప్రభుత్వం నిర్ధేశించిన లక్ష్యాన్ని చేరుకు నేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలన్నారు. భూగర్భజలాలు అడుగంటుతున్న సందర్భంలో వర్షపునీరు భూమిలోకి ఇంకే విధంగా ఇంకుడు గుంట ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు.



ఇంకుడు గుంటకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పత్తిపాటి పుల్లారావు

కావున ప్రజలంతా ఇంకుడు గుంట కార్యక్రమంలో భాగస్వాములై ప్రభుత్వానికి సహకరించాలన్నారు. మండలంలో ప్రతి ఇంట్లో నిర్మించుకునే ఇంకుడు గుంటకు అవసరమైన మెటీరియల్‌ను సప్లై చేస్తారని కావున గ్రామంలో ఉండే ప్రజలంతా ఇంకుడు గుంటలను నిర్మించుకోవాలన్నారు. అనంతరం ఆర్అండ్‌బి బంగ్లాలో మంత్రి పత్తిపాటి పుల్లారావు, మున్సిపల్ మంత్రి పొంగూరు నారాయణ, బీద మస్తాన్‌రావుతో సమావేశమై పలు అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి ఛైర్మన్ దేవరాల సుబ్రహ్మణ్యం, మున్సిపల్ ఛైర్మన్ అలేఖ్య, మాజీఎమ్మెల్యే కరణం బలరామక్రిష్ణ మూర్తి, జేసీ ఇంతియాజ్, ఏఎమ్‌సి సెక్రటరీ ఝాన్సీరాణి, టిడిపి నాయకులు రాజ్‌కుమార్ చౌదరి, పోట్లూరి శ్రీనివాసులు, పట్టణ అధ్యక్షులు మలిశెట్టి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి అమరా వేదగిరి పార్టీ నాయకులు తది తరులు పాల్గొన్నారు.

# ఇంకుడు గుంటలపై అవగాహన కల్పించాలి

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇంకుడు గుంటలపై పట్టణ ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మలిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. 14వ తేదీ స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పట్టణ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇంకుడు గుంటల కార్యక్రమంలో ప్రతివార్డు కౌన్సిలరు, కార్యకర్తలు, నాయకులు చురుగ్గా పాల్గొని ప్రతిఇంట్లో ఇంకుడు గుంట ఏర్పాటుచేసే విధంగా చూడాలన్నారు. భూగర్భజలాలు నిలువచేయుట వల్ల ఎంతో ఉపయోగం ఉందని ప్రజలకు తెలియచేయాలన్నారు. ఈ కార్య క్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి అమరా యాదగిరి గుప్త, మున్సిపల్ ఛైర్మన్ పోతుగంటి అలేఖ్య, లీగల్‌సెల్ అధ్యక్షుడు పోట్లూరి శ్రీనివాసులు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి పట్టణ అధ్యక్షులు మలిశెట్టి వెంకటేశ్వర్లు





శ్రీమతి కనుపర్తి రమాదేవి

11వ వర్ధంతి

మరువలేని నీ తీపి జ్ఞాపకాలతో
నిత్యం నీ మధురస్మృతులతో

భర్త
కె.వి.రమణయ్య
సీనియర్ పాత్రికేయులు

కుటుంబ ఉన్నతికి అహర్నిశలు
శ్రమించిన మా యింటి దైవం
ఉన్నతమైన వ్యక్తిత్వంతో అందరి
మంచి కోరుకునే మా ఇంటి దీపం
మా అమ్మను స్మరిస్తూ...

కుమారులు - కోడళ్ళు
కనుపర్తి రామకృష్ణప్రసాద్ - మీన
మృదుల
కనుపర్తి దయాశంకర్ - రేణుక
నితిన్, నందిక

కుమార్తెలు - అల్లుళ్ళు
సీతాలక్ష్మి - దంటు విశ్వనాథ సూరి
మానస, మౌనిక
జ్యోతిలక్ష్మి - చుండి వెంకటనరసింహాశర్మ
మేఘన, కౌశిక్


# స్థానికులకే ఉపాధి

## - కేంద్ర మంత్రి రాం శంకర్ కత్తేరియా

శ్రీకాళహస్తి న్యూస్

2017వ సంవత్సరం నాటికి శ్రీకాళహస్తి పట్టణంలో కేంద్రీయ విద్యాలయ స్కూల్‌లో తరగతులు ప్రారంభించడానికి అన్ని చర్యలు చేపట్టనున్నట్లు కేంద్ర మానవవనరుల శాఖ సహాయమంత్రి డా॥ రాంశంకర్ కత్తేరియా తెలిపారు. ఆదివారం శ్రీకాళహస్తి మండలంలోని మద్దిలేడు గ్రామంలోని ప్రకాష్ ఫెరోస్ స్టీల్ కంపెనీలో స్టీల్ మల్టీ డివిజన్‌కు జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్‌లో ప్రకాష్ జనరేటర్ కంపెనీ ప్రజల మన్ననలు పొందిందని, వారి ఆధ్వర్యంలోనే శ్రీకాళహస్తి పట్టణ సమీపంలో ఉన్న ప్రకాష్ స్టీల్ కంపెనీ అభివృద్ధి పథంలో పయనించడం జరుగుతుందని ఆయన తెలిపారు. కేంద్ర బడ్జెట్‌లో శ్రీకాళహస్తి నియోజకవర్గం నందు అనేక విద్యా సంస్థలకు ప్రత్యేక నిధులు కేటాయించడం జరిగిందన్నారు. పరిశ్రమల స్థాపన వలన స్థానికులకు ఉద్యోగ భద్రత దొరుకుతుందన్నారు. రాష్ట్ర అటవీశాఖ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అనేక దేశాల్లో పర్యటించి వివిధ వ్యాపారవేత్తలను ఆహ్వానిం చడంతో జిల్లాలో శ్రీసిటీ నందు 92 కంపెనీలు పెట్టుబడి పెట్టాయని, అదేవిధంగా మన్నవరం, ల్యాంకో, కోకోకోలా, అమర్‌రాజా, ప్రకాష్ స్టీల్ కంపెనీల వల్ల యువతకు ఉపాధి దొరుకుతుందన్నారు. ఎంపి వరప్రసాద్ మాట్లాడుతూ ఎంపి నిధులు అధిక భాగం త్రాగునీరుకు, సి.సి.రోడ్ల పనులకు ఎస్‌సి, ఎస్.టి. కాలనీలకు ఖర్చు చేయడం జరుగుతుందని, ప్రకాష్ కంపెనీ యాజమాన్యం మరిన్ని పరిశ్రమలు జిల్లాలో స్థాపించాలన్నారు. స్థానికంగా ఉన్నవారికి ఉద్యోగావకాశాలు కల్పించాలని కేంద్రమంత్రి డా॥ రాంశంకర్ కత్తేరియాకు ఒక వినతిపత్రం ద్వారా తెలిపారు. ఈ కార్యక్రమంలో కపిల్ అగర్వాల్, కపిలేశ్, ప్రమోద్ గార్గె, రాకేష్ గార్గె, డిఎస్పీ వెంకటకిషోర్, మున్సిపల్ చైర్మన్ పేట రాధారెడ్డి, వైస్ చైర్మన్ పార్థసారధి కేంద్రమంత్రుల చేతుల మీదుగా 440 వోల్టేజీ పవర్ జనరేటర్ ప్రారంభించారు.

# విభిన్న తీర్పు

(మొదటి పేజీ తరువాయి)

మెచ్చి అన్నాడిఎంకె ప్రభుత్వాన్ని మరో ఐదేళ్లకు రెన్యూవల్ చేశారు. తమిళనాడులో సర్వే సంస్థల అంచనాలు దారుణంగా విఫలమయ్యాయి. ఒక్క సీ-ఓటర్ సర్వే తప్ప ఎవరి అంచనా కరెక్ట్ కాలేదు. 92ఏళ్ల వయసులో చివరి అవకాశమివ్వండంటూ డిఎంకె అధినేత కరుణానిధి అభ్యర్థించినా ఓటర్లు కరుణించలేదు. ఓటర్లకు లెక్కలేనన్ని ఉచిత వరాలను ప్రకటించినా కరుణానిధిని నమ్మలేదు. గత ఐదేళ్లలో ఉచిత పథకాలను విజయవంతంగా అమలు చేసిన అన్నాడిఎంకె అధినేత్రి జయలలితకే పట్టం కట్టారు. వరుసగా రెండోసారి గెలిచి జయ తమిళ రాజకీయ చరిత్రను తిరగరాసారు. ఈ ఎన్నికల్లో పొడుస్తాడు, జయను దెబ్బకొడతాడనుకున్న విజయ్‌కాంత్ ప్రభావం నామ మాత్రమే అయ్యింది. మొత్తం 234 స్థానాలున్న తమిళనాట అన్నాడిఎంకెకు 134, సీట్లు రాగా డిఎంకె 98 సీట్లతో సరిపెట్టుకుంది.

## దీదీపై 'మమత' కురిపించారు:

ఐదేళ్ల క్రితం 25ఏళ్ల కమ్యూనిస్టు పాలనకు తెరదించిన పశ్చిమబెంగాల్ ఓటర్లు, మరో ఐదేళ్ల వరకు కూడా వారికి మొండి చేయి చూపారు. గత ఐదేళ్లలో ఎంతో సమర్ధవంతమైన పరిపాలనను అందించిన తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీకే మద్దతుగా నిలిచారు. కమ్యూనిస్టులు, కాంగ్రెస్ జత కలిసినా మమతను ఏమీ చేయలేకపోయారు. గత ఐదేళ్లలో పరిపాలనా పరంగా చిన్నచిన్న వివాదాలు తలెత్తినా మమతాబెనర్జీ విజయాన్ని అవి ఆపలేకపోయాయి. కమ్యూనిస్టుల పాలన కన్నా మమత పాలనే బాగుందనుకున్న ప్రజలు మళ్ళీ ఆమెకే జై కొట్టారు. ఈ రాష్ట్రంలో ఒంటరిగా పోటీ చేసిన బీజేపీ 3 సీట్లతో పాటు పలు నియోజకవర్గాలలో గణనీయంగా ఓట్లు సాధించడం విశేషం. ఇక 294 సీట్లున్న బెంగాల్‌లో టిఎంసికి 211 సీట్లు రాగా, వామపక్షాలు 33, కాంగ్రెస్‌కి 44 సీట్లు మాత్రమే దక్కాయి.

## కేరళలో తారుమారు:

కేరళలో మాత్రం అధికారం తారుమారయ్యింది. ప్రతిపక్షంలో వున్న ఎల్‌డిఎఫ్ అధికారం చేజిక్కించుకుంది. కాంగ్రెస్ సారధ్యంలోని అధికార యూడిఎఫ్ ప్రతిపక్షంలోకి వచ్చింది. ప్రతి ఐదేళ్లకు ఇక్కడ అధికార మార్పిడి సాధారణమే! అయితే సీఎంగా ఊమెన్‌చాందీ వైఫల్యాలు కూడా యూడిఎఫ్ ఓటమిని శాసించాయని చెప్పవచ్చు. మొత్తం 140 సీట్లున్న కేరళలో ఎల్‌డిఎఫ్ 91 సీట్లు గెలుచుకోగా, యూడిఎఫ్ 47 సీట్లను గెలుచుకుంది. కేరళలో విస్తరించడానికి ఈ ఎన్నికలను ప్రధాన వేదికగా ఎంచుకున్న బీజేపీ ఒక్క సీటును దక్కించుకోవడం విశేషం. అయితే ఆ పార్టీ 10శాతం ఓట్లతో మూడో స్థానంలో నిలవడం వాళ్ళు సాధించిన పట్టుకు నిదర్శనం.

## ఈశాన్యంలో కాషాయ జెండా:

ఎనిమిదేళ్ల క్రితం కర్నాటకలో గెలుపు ద్వారా దక్షిణ భారత దేశంలో బోణీ చేసిన బీజేపీకి ఇప్పుడు ఈశాన్య భారతంలో కూడా ఆహ్వానం లభించింది. ఈశాన్య రాష్ట్రాల్లో పెద్దదైన అస్సోంలో బీజేపీ జెండా రెపరెపలాడింది. మూడు దఫాలుగా ఇక్కడ తిరుగులేని విజయం సాధిస్తూ వచ్చిన కాంగ్రెస్‌కు బ్రేక్ పడింది. ఐదేళ్ల క్రితం జరిగిన ఎన్నికల్లో ఇక్కడ బీజేపీ ఉనికి నామమాత్రమే! కాని 2014 లోక్‌సభ ఎన్నికలు ఈ రాష్ట్ర చరిత్రను మలుపు తిప్పాయి. ఆ ఎన్నికల్లో ఎక్కువ లోక్‌సభ సీట్లను గెలుచుకున్న బీజేపీ 2016 అసెంబ్లీ ఎన్నికలపై దృష్టి పెట్టింది. బంగ్లా కాందీశీకుల సమస్యపై దృష్టిపెట్టి, చొరబాట్ల మూలంగా అస్సామీలకు జరుగుతున్న అన్యాయాలపై ఆందోళనలకు తెరతీసింది. దీంతో ఆ రాష్ట్ర ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల వ్యతిరేకత పెరిగి, అది బీజేపీ గెలుపుకు మార్గంగా మారింది. మొత్తం 126 సీట్లున్న అస్సోంలో బీజేపీ కూటమి 86 సీట్లతో విజయం సాధించగా, కాంగ్రెస్ 26 సీట్లతో సరిపెట్టుకుంది.

## పుదుచ్చేరిలో కాంగ్రెస్:

30సీట్లున్న పుదుచ్చేరిలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. డిఎంకె - కాంగ్రెస్ కూటమికి 17 సీట్లు వచ్చాయి. సీఎం రంగస్వామి నేతృత్వంలోని ఏఐఎన్ఆర్‌సికి 8 సీట్లు, అన్నా డిఎంకెకు 4 సీట్లు వచ్చాయి.

ఈ ఫలితాలు బీజేపీని బాగా ఉత్సాహపరిచాయి. ఎందుకంటే ఎలాంటి ఆశలు లేని ఓ కొత్త రాష్ట్రం అస్సోంలో వాళ్ళు అడుగుపెట్టారు. మిగిలిన నాలుగు రాష్ట్రాలపై వారికి పెద్దగా ఆశలు లేవు. ఈ ఫలితాల్లో తీవ్ర నిరాశ కలిగింది కాంగ్రెస్‌కే! అస్సోం, కేరళలలో ఆ పార్టీ అధికారాన్ని కోల్పోయింది. గుడ్డిలో మెల్ల ఏంటంటే పశ్చిమబెంగాల్‌లో సీపీఎం కంటే కాంగ్రెస్‌కు ఎక్కువ సీట్లు రావడం, పుదుచ్చేరిలో అధికారంలోకి రావడం. సర్వేలను చూసి అధికారం ఖాయమనుకున్న డిఎంకె డీలా పడిపోయింది. జయ, మమతలకు ఈ ఫలితాలు సంతృప్తి మిగిల్చాయనే చెప్పొచ్చు.

## కాలధర్మం

### వాస గోపాలరెడ్డి



కనుపర్తిపాడు వాస్తవ్యుడు, నెల్లూరు నివాసి వాస గోపాలరెడ్డి తన 62వ యేట మే 15 ఆదివారం రాత్రి కన్నుమూశారు. ఆయన గత కొంతకాలంగా కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. ఆయనకి భార్య, ఇద్దరు కుమారులు వున్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని ఇతర రాష్ట్రాలలో సైతం ఆయన పలు కాంట్రాక్ట్ కంపెనీలలో పని చేయడంతో పాటు స్వయంగా సబ్‌కాంట్రాక్ట్‌లను కూడా చేసేవాడు. నెల్లూరు మాజీశాసనసభ్యుడు జె.కె.రెడ్డి సతీమణి శ్రీమతి సులోచనమ్మకు గోపాలరెడ్డి స్వయానా తమ్ముడు. ఆయన ఉత్తరక్రియలు 25వ తేదీ బుధవారం కనుపర్తిపాడులో జరుగుతాయని కుటుంబసభ్యులు తెలిపారు. గోపాలరెడ్డి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

# నిస్వార్థ రాజకీయాలకు నిలువెత్తు నమూనా

## కాంగ్రెస్ పార్టీలో ప్రత్యేక ముద్ర వేసుకున్న అరుణమ్మ



నివాళులర్పిస్తున్న జడ్పీ ఛైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, ఆనం విజయకుమార్‌రెడ్డి, పనబాక కృష్ణయ్య, చేవూరు దేవకుమార్‌రెడ్డి తదితరులు

ఈనాటి కాలంలో కూడా ఆనాటి విలువలు కలిగిన రాజకీయ నాయకురాలు, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి పందిళ్ళపల్లి అరుణమ్మ. ప్రస్తుత రాజకీయాలు ఎంత అసహ్యంగా ఉన్నాయో చూస్తున్నాము. విలువలు, విశ్వాసానికి స్థానం లేదు. స్వార్థమే లోకం. పదవులే పరమార్ధం. పదవుల కోసం, అధికారం కోసం అశ్రయమిచ్చి, ఆదరించిన వారిని కూడా వెన్నుపోటు పొడిచే నేటి రాజకీయాలను చూస్తున్నాం. ఎవరు ఎప్పుడు ఏ పార్టీలోకి మారుతారో తెలియని నాయకులున్న నేటి కాలంలో అరుణమ్మ వంటి నాయకురాలు పదవులతో పని లేకుండా, అధికారం అవసరం లేకుండా 40ఏళ్ల పాటూ కాంగ్రెస్‌లో నిస్వార్ధంగా సేవలందించారు. అందులో 21సంవత్సరాల పాటు జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా పని చేశారు. బహుశా రాష్ట్రంలోనే ఇంత సుధీర్ఘకాలం మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా పని చేసినవారుండకపోవచ్చు. రాష్ట్ర విభజన తర్వాత రాష్ట్రంలో, జిల్లాలో పెద్దపెద్ద నాయకులందరూ కాంగ్రెస్‌పార్టీని వీడి వెళ్లినా ఆమె వీడ లేదు. కాంగ్రెస్‌లోనే ఉంటూ, చివరకు తాను అభిమానించే కాంగ్రెస్‌పార్టీ నాయకురాలిగానే తుదిశ్వాస విడిచారు. ఒకే పార్టీని ఒకే సిద్ధాంతాన్ని నమ్మిన ఆమె వ్యక్తిత్వాన్ని అందరూ గౌరవిస్తున్నారు.

కాబట్టే ఆమె మరణించిందని తెలియగానే రాజకీయాలకతీతంగా జిల్లాలోని నాయకులందరూ బాధపడ్డారు. 10వ తేదీ రాత్రి ఆమె మృతి చెందగా, 11వ తేదీ ఉదయం నెల్లూరు బాలాజీనగర్‌లోని ఆమె స్వగృహానికి జడ్పీ ఛైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, పి.అనిల్‌కుమార్‌యాదవ్, వివిధ పార్టీల నాయకులు నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి, ఆనం విజయకుమార్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కిలారి వెంకటస్వామినాయుడు, ఉచ్చి భువనేశ్వర ప్రసాద్, పి.కోటేశ్వరరెడ్డి, కర్తం ప్రతాప్‌రెడ్డి ఆమె భౌతికకాయం వద్ద నివాళులర్పించారు.

## కాంగ్రెస్ పతాకంతో నివాళి

తుది శ్వాసదాకా కాంగ్రెస్ కోసం పనిచేసిన అరుణమ్మ మృతదేహం పై కాంగ్రెస్‌పార్టీ పతాకాన్ని కప్పి జిల్లా కాంగ్రెస్ నాయకులు ఆమెకు అరుదైన గౌరవంతో నివాళులర్పించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు సి.వి.శేషారెడ్డి, చేవూరు దేవకుమార్‌రెడ్డి, పి.చెంచలబాబుయాదవ్, రఘురాం ముదిరాజ్, పత్తి సీతారాంబాబు, టి.బాలసుధాకర్, మమూలం భాస్కర్, శివాచారి, బాలకృష్ణ, నారాయణచార్య తదితర కాంగ్రెస్ నాయకులు ఆమెకు కన్నీటి నివాళులర్పించారు. అలాగే వివిధ రంగాల ప్రముఖులు వేలాదిగా వచ్చి ఆమె మృతదేహాన్ని సందర్శించి సంతాపం తెలిపారు. 11వ తేదీ సాయంత్రం జరిగిన అంతిమయాత్రలో కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి ఫోన్‌లో అరుణమ్మ కుమారుడు హేమంత్‌రెడ్డిని పరామర్శించి ధైర్యం చెప్పారు. అరుణమ్మ ఎం.పి, ఎమ్మెల్యే, మంత్రి వంటి పెద్ద పదవులు చేపట్టకపోయి వుండొచ్చు, కాని అవకాశవాదం కోసం పార్టీలు మార్చే సంస్కృతికి భిన్నంగా ఒకే పార్టీని నమ్ముకుని అంతకంటే గొప్పదైన గౌరవాన్ని, అభిమానాన్ని సంపాదించుకుంది. జోహార్ అరుణమ్మ!

# కరుణించని కేంద్రం

(మొదటి పేజీ తరువాయి)

మోడీకి నచ్చడం లేదు. అప్పుల్లో, ఆర్ధిక ఇబ్బందుల్లో వున్న రాష్ట్రానికి తాను సీఎంగా వున్నానన్న విషయం చంద్రబాబు మర్చిపోతున్నాడు. అమెరికాలోని కొలంబియా రాష్ట్రానికో, జార్జియా రాష్ట్రానికో తాను ముఖ్యమంత్రిని అన్నట్లు ఆయన పోకడలున్నాయి. మితిమీరిన చంద్రబాబు దుబారా ఖర్చు సంగతి కేంద్రం దాకా వెళ్లింది. రాష్ట్రంలో ఆర్ధిక వ్యవస్థ అస్తవ్యస్థంగా వుందని, ప్రజాధనాన్ని అక్రమమార్గాలలో లూటీ చేస్తున్నారని, అనవసరమైన ఖర్చులు ఎక్కువగా పెట్టేస్తున్నారనే విషయం రాష్ట్రంలోని బీజేపీ శ్రేణుల ద్వారా కేంద్రానికి చేరింది. ఈ నేపథ్యంలోనే రాష్ట్రానికి నేరుగా నిధులివ్వడానికి కూడా కేంద్రం సంసిద్ధంగా లేదు. ముఖ్యంగా 16వేల కోట్లు అంచనా వేసిన పోలవరం ప్రాజెక్ట్ వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వం రెండింతలు చేసింది. కేవలం ప్రాజెక్టు పేరుతో దోపిడీ కోసమే అంచనా వ్యయాన్ని పెంచారని రాష్ట్ర బీజేపీ నాయకులే విమర్శలు గుప్పిస్తున్నారు.

చంద్రబాబుపై ప్రధాని మోడీకి నమ్మకం లేదు. మొదట నుండి కూడా చంద్రబాబు పట్ల ఆయన ఎడబాటు ధోరణితోనే వున్నారు. చంద్రబాబు ఆడంబరాలు ఆయనకు అస్సలు నచ్చడం లేదు. అమరావతి రాజధాని పేరుతో చేస్తున్న హంగామా కూడా నచ్చడం లేదు. చంద్రబాబు ఏం అడిగినా కేంద్రం ఇచ్చే పరిస్థితి లేదు.


అశ్రునివాళి



మానవత్వానికి నిలువెత్తు రూపం
మంచితనం, మమకారానికి ప్రతిరూపం
జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు
శ్రీమతి పందిళ్ళపల్లి అరుణమ్మ గారి
ఆకస్మిక మృతికి చింతిస్తూ...
వారి పవిత్రాత్మకు శాంతిని చేకూర్చమని భగవంతుని ప్రార్థిస్తూ...
వి.ఆర్.సి వాకర్స్ అసోసియేషన్ సభ్యులు
వి.ఆర్.సి మహిళా వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

# శ్రద్ధాంజలి

జాతస్య హిద్రువో మృత్యు: ధ్రువం జన్మ మృతస్యచ తస్మాద పరిహార్యేర్థే నత్వం శోచితు మర్హసి!!



## స్వర్గీయ శ్రీమతి పందిళ్ళపల్లి అరుణమ్మ గారు

నెల్లూరు జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు

02-05-1951 - 10-05-2016

మా దైవం నీవే... మా జీవం నీవే... మా ఇంట్లో దీపమై వెలిగావు... మా గుండెల్లో దైవమై నిలిచావు.
నువ్వు చూపిందే మాకు మార్గం... నువ్వు తోడున్న జీవితమే మాకు స్వర్గం.
ప్రేమానురాగాల ప్రతిరూపం మీరు... మానవత్వానికి చిరునామా మీ పేరు.
ఆత్మీయతను పంచారు... అనురాగాన్ని పెంచారు... మానవతా విలువలతో మమ్ము నడిపించారు.
మీ ప్రేమ, మీ స్నేహం, మీ అభిమానం, మీ అప్యాయత, కల్మషం లేని మీ పలకరింపు..
మీ జ్ఞాపకాల ప్రతిరూపాలై మా మనసుల్లో చిరస్థాయిగా నిలిచే వుంటాయి.
కష్టాలలో వెన్నుతట్టి నిలిచావు. కన్నీళ్ళను తుడిచి ధైర్యంగా ముందుకు నడిపావు...
జ్ఞాపకాలలో, మా ఆలోచనల్లో, మేం పీల్చే శ్వాసలో, మా ఆశల్లో, మా ఇంటి దీపంలో, మా కంటి పాపలలో
మా అమ్మవై, దేవతకు ప్రతిరూపమై... మాతోనే వుంటావని...
మాకు తోడుంటావని, నీ చల్లని దీవెనలు అందిస్తూనే వుంటావని ఆశిస్తూ...

కుమారుడు - కోడలు
పందిళ్ళపల్లి హేమంత్ రెడ్డి - సింధు
మనుమరాలు - కామాక్షి హన్విత రెడ్డి

భర్త - పందిళ్ళపల్లి పట్టాభిరామిరెడ్డి

కుమార్తె - అల్లుడు
నిరూప - చెర్లో కోటారెడ్డి

**పెద్దకర్మ:** తేది **26-05-2016** గురువారం ఉ॥ 9 గం॥లకు, నెల్లూరు బాలాజీనగర్‌లోని మాస్వగృహమునందు జరుగును. కావున బంధుమిత్రులకు, శ్రేయోభిలాషులకు, అభిమానులకు, పత్రికాముఖంగా తెలియజేయడమైనది.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com